

ఎంఆర్‌పీకి మంగళం..
వ్యాపారుల ఇష్టారాజ్యం!

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -147 మంగళవారం17 నవంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

ఎన్నికల్లో రిజర్వేషన్ల అధికారం రాష్ట్రాలదే

రిజర్వేషన్ల రొటేషన్ విధానంపై సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):
స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కేటాయింపుపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఏయే స్థానాలకు ఏ రిజర్వేషన్ వర్తింపజేయాలన్న దానిపై అధికారం పూర్తిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుందని పేర్కొంది. తమ నియోజకవర్గాన్ని రిజర్వుడ్‌గా నిర్ణయించాలని కోరే హక్కు ఎవరికీ ఉండదని స్పష్టం చేసింది. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించి నూతన రొటేషన్ విధానాన్ని అమలు చేస్తుండడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది. రూపాలీ ఇంద్రభూషణ్ సోండే అనే వ్యక్తి.. బాంబే హైకోర్టులోని **మిగతా 2లో...**

విజయవాడలో రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం..

ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా

చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ఘన స్వాగతం

తొమ్మిది రంగాల్లో విశిష్ట వ్యక్తులకు పురస్కారాలు

అవార్డు గ్రహీతలకు పది లక్షల నగదు బహుమతి



విజయవాడ నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):
విజయవాడ నగరంలో రామోజీ ఎక్సలెన్స్ అవార్డులు - 2026 ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమైంది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్**మిగతా 2లో...**

ఫిలిప్పీన్స్‌లో మోదీ పర్యటన

ఆసియాన్, తూర్పు ఆసియా సదస్సుల్లో పాల్గొన్న ప్రధాని..

వాణిజ్యం, సముద్ర భద్రతపై కీలక చర్చలు



మనిలా: నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):
భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫిలిప్పీన్స్ పర్యటనలో భాగంగా మనిలాలో జరుగుతున్న 23వ ఆసియాన్‌భారత్ సదస్సు, 21వ తూర్పు ఆసియా సదస్సుల్లో పాల్గొంటున్నారు. ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ ఆహ్వానం మేరకు నవంబర్ 16 నుంచి 17 వరకు ఆయన ఈ పర్యటన చేపట్టారు.**మిగతా 2లో...**

ఐసీసీ చైర్మన్ పీఠంపై మరోసారి జై షా..

బాలిలో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో కీలక నిర్ణయం

జై షా నియామకంపై హర్షం వ్యక్తం చేసిన మంత్రి నారా లోకేశ్



2లో.

ఇరిగేషన్ పై ఫోకస్

సమ్మక్కసాగర్‌కు ఎన్‌వోసీ కోసం నేడు ఛత్తీస్‌గఢ్‌కు ముఖ్యమంత్రి

మంత్రి ఉత్తమ్‌తో కలిసి ఆ రాష్ట్ర సీఎంతో భేటీ

ఇప్పటికే నయా రాయ్‌పూర్‌కు అధికారులు

ఛత్తీస్‌గఢ్ ఎన్‌వోసీ ఇస్తే సీడబ్ల్యూసీ

అనుమతుల కోసం మరోసారి డీపీఆర్ దాఖలు



హైదరాబాద్, నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):
: సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం) ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) సాధించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగుతున్నారు. ఇందుకోసం ఆయన ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లనున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న సీఎం మంగళవారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి నయా రాయ్‌పూర్‌కు వెళ్లి.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్‌తో సమావేశం కానున్నారు. వాస్తవానికి సమ్మక్కసాగర్ ప్రాజెక్టు డీపీఆర్‌కు సీడబ్ల్యూసీలోని అంతర్రాష్ట్ర విభాగం మినహా.. అన్ని డైరెక్టరేట్లు ఇప్పటికే క్లియరెన్సులు ఇచ్చాయి.
కేవలం ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ తెచ్చుకుంటే ఈ ప్రాజెక్టుకు క్లియరెన్స్ ఇస్తామని సీడబ్ల్యూసీ ఇదివరకే తేల్చిచెప్పింది. దాంతో 2023 డిసెంబరులో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత సమ్మక్కసాగర్ ప్రాజెక్టు అనుమతులపై దృష్టి పెట్టింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఓసారి స్వయంగా ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లి ఆ రాష్ట్ర సీఎం విష్ణుదేవ్‌ను కలుసుకొని చర్చించారు. ఆ తర్వాత రెండుసార్లు హైదరాబాద్, న్యూఢిల్లీలో కూడా ఛత్తీస్‌గఢ్ సీఎంతో చర్చలు జరిపారు. ఈ క్రమంలోనే ముంపుపై అధ్యయనానికి నిధులను కూడా ప్రభుత్వం సమకూర్చింది. ఆ అధ్యయన నివేదిక వచ్చాక.. ముంపు ఏ మేరకు ఉంటుందనే దానిపై అంచ నాలు రూపొందించి భూములకు గరిష్ఠ పరిహారం చెల్లిస్తామని ఛత్తీస్‌గఢ్‌కు హామీ ఇచ్చింది. మరోవైపు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్,ఉత్తమ్ పలుమార్లు **మిగతా 2లో...**

పాత పెన్షన్ కోసం పోరు..

17న సీపీఎస్ ఉద్యోగుల సామూహిక సెలవు

రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ధర్మ దీక్షలకు పిలుపు

కాంగ్రెస్ ఎన్నికల హామీని గుర్తు చేస్తూ ఉద్యోగుల ఆందోళన

2.15 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొనే అవకాశం



హైదరాబాద్, నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):
పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలనే డిమాండ్‌తో తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరోసారి పోరుబాట పట్టారు. ఇందులో భాగంగా మంగళవారం (17న) రాష్ట్రవ్యాప్తంగా సామూహిక సెలవు పాటించనున్నట్లు తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీజీసీపీఎస్ఈయూ) ప్రకటించింది. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ 'ధర్మ దీక్షలు' చేపట్టనున్నట్లు తెలిపింది.
యూనియన్ అధ్యక్షుడు స్థితప్రజ్ఞ మాట్లాడుతూ, 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పెన్షన్ విధానంపై ఇచ్చిన హామీకి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ ఆందోళన**మిగతా 2లో...**

ఓటుకు వెయ్యి, ఉచిత ప్రయాణం!..

హైదరాబాద్ వాసులకు ఏపీ పంచాయతీ నేతల ఆఫర్లు?

ఏపీ పంచాయతీ ఎన్నికల వేళ హైదరాబాద్ ఓటర్లపై అభ్యర్థుల దృష్టి

కూకట్‌పల్లి, అమీర్‌పేట వంటి ప్రాంతాల్లో ఓటర్లతో నేతల సమావేశాలు

పోలింగ్ తేదీల్లో ఏపీకి ప్రయాణ టికెట్ల ధరలను పెంచిన ట్రావెల్ ఏజెన్సీలు

ఓటర్లను ఆకట్టుకునేందుకు కార్తీక మాస వనభోజనాల ఏర్పాటు



అమరావతి హైదరాబాద్ నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):
ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల వేడి తారస్థాయికి చేరుకుంది. స్థానిక పోరులో గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు.. ఇప్పుడు హైదరాబాద్‌లో స్థిరపడిన**మిగతా 2లో...**



ఈసీని ప్రశ్నిస్తాం



ఓటర్ల జాబితా సవరణపై 48 ప్రశ్నలు..


అనుమతించాలని సుప్రీంకోర్టును కోరిన ఇండియా బ్లాక్



న్యూఢిల్లీ, నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):
దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీఐ) ప్రశ్నించేందుకు అనుమతించాలని కోరుతూ ఇండియా బ్లాక్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు 48 ప్రశ్నలతో కూడిన పిటిషన్‌ను దాఖలు చేశారు.**మిగతా 2లో...**

17 ఏళ్లుగా జైల్లో ఉన్నారు.. బెయిల్ ఇస్తున్నాం!

బిల్కిస్‌బానో కేసులో దోషుల పిటిషన్‌పై సుప్రీంకోర్టు సంచలన ఉత్తర్వులు



నా వైపు నుంచి కథ ఏమిటో చెప్పా

'బిలాంగింగ్' ఆత్మకథ ఆవిష్కరణలో సోనియా

అమ్మ నాలుగు సార్లు క్యాన్సర్‌ను జయించింది

నాన్న మరణంతో అమ్మ ముభావంగా మారింది

చిన్ననాటి జ్ఞాపకాలతో రాహుల్‌గాంధీ ఉద్వేగం

కార్యక్రమానికి హాజరైన సీఎంలు రేవంత్, డీకే

న్యూఢిల్లీ, నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):
తన కుటుంబంపై ఏళ్ల తరబడి తప్పుడు ప్రచారం జరిగిందని, చివరకు తాను మాట్లాడాలనుకున్నానని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అన్నారు**మిగతా 2లో...**

అమర్తకం ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

ఈసీని ప్రశ్నిస్తాం

మొదటిపేజీ తరువాయి

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు పలు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు ఈ పిటిషన్‌లో పిటిషనర్లుగా ఉన్నారు.ఎస్ఐఆర్‌కు సంబంధించి తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా జరిగాయని ఎన్నికల సంఘం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొంది. అయితే ఈ అఫిడవిట్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి నిజంగా ఆమోదించారా? అనే విషయంపై ఇండియా బ్లాక్ నేతలు ప్రశ్నలు సంధించారు. ఆమోదం ఏ తేదీన, ఏ సమావేశంలో లేదా ఫైల్ సర్క్యులేషన్ ద్వారా ఇచ్చారో వెల్లడించాలని కోరారు.ఎస్ఐఆర్, ఈసీఐనెట్, ఫారం-6, అప్పీళ్ల దాఖలు వంటి అంశాల్లో ఎన్నికల కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నాయా? ఉంటే ఎన్ని సందర్భాల్లో లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారు? ఏ నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నారు? మరికొన్ని నిర్ణయాలు మెజారిటీ ఆధారంగా జరిగాయా? అనే వివరాలను కోరారు. 2025 ఫిబ్రవరి 19 నుంచి 2026 అక్టోబర్ 26 వరకు జరిగిన పరిణామాలకు సంబంధించిన రికార్డులను సమర్పించాలని పిటిషనర్లు కోరారు.కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఆన్‌లైన్ ఫారం-6లో అదనపు డిక్లరేషన్‌ను ఎవరు ప్రవేశపెట్టారు? ఎప్పుడు అమల్లోకి తీసుకొచ్చారు? ఎన్నికల సంఘం అధికారికంగా ఆమోదించిందా? అనే ప్రశ్నలను లేవనెత్తారు. ఈ నిబంధనల కారణంగా ఎన్ని దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని ప్రాసెస్ చేయకుండా నిలిచిపోయాయి అనే గణాంకాలను వెల్లడించాలని కోరారు.ఎస్ఐఆర్ సందర్భంగా ముసాయిదా, తుది ఓటర్ల జాబితాల నుంచి తొలగించిన పేర్లకు సంబంధించిన రాష్ట్రాల వారీ గణాంకాలను వెల్లడించాలని ఇండియా బ్లాక్ నేతలు కోరారు. మరణం, వలస, గైర్హాజరు, డూప్లికేషన్ వంటి కారణాలతో తొలగించిన ఓటర్ల వివరాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఫారం-7 ద్వారా వచ్చిన అభ్యంతరాలు, వాటిలో తప్పుడు ఫిర్యాదుల సంఖ్య, బాధ్యులపై తీసుకున్న చర్యల వివరాలనూ అడిగారు.అలాగే ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ) ఆదేశాలు లేకుండానే ఓటర్ల జాబితాలో పేర్లను చేర్చడం, తొలగించడం లేదా మార్పులు చేయడం జరిగిందా? ఒకసారి తొలగించిన ఓటరు పేరును తిరిగి చేర్చే అధికారం ఈసీఐనెట్‌లో అధికారులకు ఉందా? అనే అంశాలపై స్పష్టత కోరారు.ఈ పిటిషన్‌లో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ నేత సౌగతా రాయ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ ప్రసాద్ యాదవ్, సంజయ్ రౌత్, ఎంఏ బేబీ, డి.రాజా, మహువా మాఝీ, సుప్రియా సూలే, ఈటీ మహమ్మద్ బషీర్ తదితరులు ఉన్నారు.ఎన్నికల సంఘం నిర్ణయాల వెనుక ఉన్న ప్రక్రియ, ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై సమాధానాలు రాబట్టడమే ఈ పిటిషన్ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ఈ అంశంపై సుప్రీంకోర్టు నవంబర్ 17న విచారణ చేపట్టనుంది.

విజయవాడలో రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం..

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఒకే వేదికపై కేంద్ర హోంమంత్రితో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పాల్గొనడంతో సభా ప్రాంగణం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది.విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదిక వేదికగా జరుగుతున్న ఈ సభకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేరుకోగా.. రామోజీ గ్రూప్ సీఎండీ సి.హెచ్. కిరణ్ వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు చంద్రబాబు, పవన్ కల్యాణ్, సి.హెచ్. కిరణ్ సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా విచ్చేసి విశిష్ట వ్యక్తులకు పురస్కారాలు అందించే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. అమిత్ షాకు గవర్నర్ అబ్దుల్



నజీర్, సీఎం చంద్రబాబు స్వాగతం పలికారు.

ఈనాడు సంస్థల వ్యవస్థాపకులు దివంగత రామోజీరావు సమాజానికి అందించిన సేవలను స్మరిస్తూ, ఆయన జయంతి రోజైన నవంబర్ 16న రామోజీ గ్రూప్ ఈ ఎక్సలెన్స్ అవార్డులను ఏటా ప్రదానం చేస్తోంది. సమాజ హితం కోసం, ప్రజా ప్రయోజనాల కోసం వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులను గుర్తించి గౌరవించడమే ఈ పురస్కారాల ముఖ్య ఉద్దేశం. గతేడాది రామోజీ ఫిల్మ్‌సిటీలో తొలి విడత అవార్డుల ప్రదానోత్సవం జరగ్గా.. ఇప్పుడు రెండో ఎడిషన్ కార్యక్రమాన్ని విజయవాడలో నిర్వహిస్తున్నారు.

గతేడాది 7 విభాగాల్లో పురస్కారాలు ఇవ్వగా, ఈ ఏడాది ఆ సంఖ్యను 9కి పెంచారు. జర్నలిజం, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవ, మహిళా సాధికారత, కళలు-సంస్కృతి, గ్రామీణాభివృద్ధి-వ్యవసాయం, యూత్ ఐకాన్ విభాగాలతో పాటు.. కొత్తగా విద్య, వైద్య-ఆరోగ్య రంగాలను కూడా చేర్చారు. దేశవ్యాప్తంగా వచ్చిన వందలాది నామినేషన్లను సమగ్రంగా పరిశీలించిన అనంతరం నిపుణుల కమిటీ తుది జాబితాను ఖరారు చేసింది. ఎంపికైన 9 మంది పురస్కార గ్రహీతలకు ప్రశంసా పత్రం, ప్రత్యేక జ్ఞాపికతో పాటు రూ.10 లక్షల చొప్పున నగదు బహుమతిని అతిథుల చేతుల మీదుగా అందజేస్తున్నారు

నా వైపు నుంచి కథ ఏమిటో చెప్పా

మొదటిపేజీ తరువాయి

అందుకే తన భావాలను పుస్తక రూపంలో తీసుకొచ్చానని చెప్పారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో ఆమె రాసిన ఆత్మకథను సోమవారం ఢిల్లీలోని ఐటీసీ హోటల్‌లో అధికారికంగా ఆవిష్కరించారు. ఈ పుస్తకం ఈ నెల 10నే మార్కెట్‌లోకి వచ్చింది. ప్రచురణ సంస్థ హార్పర్ కాలిన్స్ ఇండియా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాహుల్, ప్రియాంక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత సోనియా పుస్తకం గురించి మాట్లాడారు. 'నా అత్తగారు ఇందిరాగాంధీ, నా భర్త, కొడుకు రాహుల్, కూతురు ప్రియాంక.. ఇలా మా కుటుంబం అందరి మీదా ఎన్నో ఏళ్లుగా తప్పుడు ప్రచారం చేశారు. మనసును గాయపరిచే మాటలు అన్నారు. నా వైపు నుంచి కథ ఏమిటో చెప్పాలంటే పుస్తకం రాయడమే సరైందని అనిపించింది' అని సోనియా చెప్పారు. పుస్తకానికి వస్తున్న ఆదరణ ఎంతో సంతోషం కలిగించిందన్నారు.

తన పిల్లలు రాహుల్, ప్రియాంక, స్నేహితురాలు మంజూలికా దూబే పట్టుబట్టడం వల్లే ఈ పుస్తకం రాశానని తెలిపారు. తనకు డైరీ రాసే అలవాటు లేదని, జీవితంలో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకుని రాశానని చెప్పారు. మొదట్లో రాయడం కష్టంగా అనిపించినా, ఒకసారి మొదలుపెట్టాక ఆనకట్ట తెగినట్టు జ్ఞాపకాలన్నీ బయటకు వచ్చాయని అన్నారు. అత్త ఇందిరాగాంధీ హత్య, భర్త రాజీవ్‌గాంధీ హత్యల గురించి రాసేటప్పుడు చాలా కష్టంగా అనిపించిందని చెప్పారు.

ఇటలీ నుంచి వచ్చి కొత్త సంస్కృతిలో, కొత్త కుటుంబంలో కలిసిపోవడానికి తాను పడిన కష్టమే ఈ పుస్తకమని సోనియా చెప్పారు. ఈ దేశానికి చెందినదాన్నిగా మారిన అనుభవాన్ని చెప్పడానికే 'బిలాంగింగ్' అనే పేరు పెట్టానన్నారు. పెళ్లయి అత్తారింటికి చేరే చాలామంది అమ్మాయిలకు ఎదురయ్యే అనుభవమే తనకూ ఎదురైందని చెప్పారు. అందరు కోడళ్లలాగే తానూ కొత్త వాతావరణానికి, కొత్త పద్ధతులకు అలవాటు పడ్డానన్నారు. ఇందిరాగాంధీ అంటే మొదట్లో తనకు



ఎంతో భయంగా ఉండేదని, ఆమెను 'మమ్మీ' అని పిలవడానికి కొంత సమయం పట్టిందని సోనియా చెప్పారు. రాహుల్, ప్రియాంక పుట్టాక ఇందిరలో ఎంతో మార్పు వచ్చిందని తెలిపారు. ఆమె ఎంత బిజీగా ఉన్నా డైనింగ్ టేబుల్ దగ్గర అందరం కలుసుకుని మాట్లాడుకునే వాళ్లమని గుర్తుచేసుకున్నారు.

పుస్తకావిష్కరణలో రాహుల్‌గాంధీ తన తల్లిదండ్రుల గురించి చెప్పిన సంగతులు సభికులను ఒకసారి నవ్వించాయి, మరోసారి కంటతడి పెట్టించాయి. సోనియా, రాజీవ్ తొలిసారి కలుసుకున్న కేంబ్రిడ్జ్‌లోని వర్సిటీ రెస్టారెంట్‌కు చాలా ఏళ్ల తర్వాత తన గర్ల్‌ఫ్రెండ్‌తో వెళ్లానని రాహుల్ చెప్పారు. తన తల్లిదండ్రులు అక్కడే కలిశారని చెబితే, అక్కడి వ్యక్తి 'వాళ్లిద్దరూ నాకు బాగా తెలుసు' అన్నాడని తెలిపారు. అతను చెప్పిన 'చికెన్ షాసర్' ఆర్డర్ చేశామని అన్నారు. '[ప్రేమలో పడాలంటే వర్సిటీ రెస్టారెంట్‌కు వెళ్లండి. కానీ అక్కడ చికెన్ షాసర్ మాత్రం తినకండి. అక్కడ భోజనం బ్రహ్మాండంగా ఉండేదని వీళ్లకు గుర్తుంది. కానీ దారుణంగా ఉంది' అనడంతో సభలో నవ్వులు విరిశాయి. ఇంట్లో భోజనం చేసేటప్పుడు నాన్న తన ఒడిలో అమ్మను కూర్చోబెట్టుకునే వారని రాహుల్ చెప్పారు. అన్ని ఇళ్లలో అలాగే ఉంటుందని అనుకునే వాడినని, స్నేహితుల ఇంట్లో అలా లేకపోవడం చూసి ఆశ్చర్యపోయే వాడినని అన్నారు. తల్లిదండ్రులు గొడవ పడటం తాను ఒక్కసారే చూశానని చెప్పారు. నాన్న ఫోన్‌లో అమరీందర్‌సింగ్‌తో మాట్లాడుతూ అమ్మ పిలుపును పట్టించుకోనప్పుడే ఆ గొడవ జరిగిందని, సభలో ఉన్న అమరీందర్ వైపు చూపిస్తూ గుర్తు చేశారు. "ఒక అందమైన జీవితాన్ని చూస్తూ పెరిగాం. ఆ తర్వాత ఒక్కసారిగా అంతా ముక్కలై పోయింది. మా ఆధారాల్లో ఒకరిని తుపాకీతో కాల్చిచంపారు. మా అతిపెద్ద ఆధారం బాంబు దాడిలో ముక్కలైపోయారు" అని రాహుల్ ఆవేదనగా చెప్పారు. అమ్మ నాలుగు సార్లు క్యాన్సర్‌ను జయించారని, కానీ దాన్ని ఆమె ఎప్పుడూ పెద్దగా చెప్పుకోరని రాహుల్ వెల్లడించారు. "నా జీవితంలో ఒక్కసారి కూడా ఆమె భయపడటం గానీ, వెనకడుగు వేయడం గానీ చూడలేదు. అమ్మా... నాన్న నిన్ను ఎంతో ప్రేమించారు. నిన్ను చూసి ఆయన ఎంత గర్వపడేవారో చెప్పలేను" అంటూ తల్లి వైపు తిరిగి ఉద్వేగంగా ప్రసంగం ముగించారు.

రాజీవ్‌తో ప్రేమ ఓ అద్భుతం

రాజీవ్‌తో తన ప్రేమ ఒక అద్భుతమని సోనియా అన్నారు. ఆయన రాజకీయాల్లోకి వెళ్లడాన్ని తాను వ్యతిరేకించానని, ఆ సమయంలో స్వార్థంగా ఆలోచించానేమోనని ఇప్పుడు అనిపిస్తోందని చెప్పారు. రాజీవ్ మరణం తన జీవితాన్ని అతలాకుతలం చేసిందన్నారు. ఆ తర్వాత తాను చిన్నపిల్లలా అయిపోయానని, రాహుల్, ప్రియాంకలే తనకు తల్లిదండ్రులుగా మారి కాపాడారని చెప్పారు.

ప్రతిపక్షాల బల ప్రదర్శన

సోనియా పుస్తకావిష్కరణ కార్యక్రమం ప్రతిపక్షాల బల ప్రదర్శనకు వేదికగా మారింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం శివకుమార్, హిమాచల్ సీఎం సుఖ్వీందర్‌సింగ్ సుఖుతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్, తృణమూల్ నేత అభిషేక్ బెనర్జీ కూడా వచ్చారు. నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, జేఎంఎం నేత, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, తమిళనాడు సీఎం విజయ్ కూడా హాజరయ్యారు.

పాత పెన్షన్ కోసం పోరు..

మొదటిపేజీ తరువాయి

చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.60 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉండగా, అత్యవసర సేవల విభాగంలో పనిచేస్తున్న 45,000 మందికి మినహాయింపు ఇచ్చారు. మిగిలిన 2.15 లక్షల మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే 1.50 లక్షల మందికి పైగా ఉద్యోగులు సామూహిక సెలవు కోసం దరఖాస్తు చేసుకున్నారని యూనియన్ వెల్లడించింది.

ఈ డిమాండ్‌పై యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్వరీ శ్రీకాంత్ నేతృత్వంలోని బృందం ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాను కలిసి వినతిపత్రం సమర్పించింది. తమ జీతం నుంచి 11.5 శాతం సీపీఎస్‌కు జమ చేస్తున్నప్పటికీ, పదవీ విరమణ తర్వాత పెన్షన్, వైద్య భద్రతపై తీవ్ర అనిశ్చితి నెలకొందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల తరహాలో తక్షణమే చర్యలు తీసుకోవాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన హామీని నిలబెట్టుకోవాలని వారు కోరారు.

సీపీఎస్ ఉద్యోగుల సామూహిక సెలవుకు ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డితో పాటు పలు ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటించాయి. నల్గొండలో జరిగే ధర్మ దీక్షలో శ్రీపాల్ రెడ్డి పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు పాల్గొని విజయవంతం చేయాలని యూనియన్ పిలుపునిచ్చింది. ఈ ఆందోళన కారణంగా నవంబర్ 17న అత్యవసరం కాని ప్రభుత్వ సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది.

ఐసీసీ చైర్మన్ పీఠంపై మరోసారి జై షా..

నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త);

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఛైర్మన్‌గా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన జై షాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ క్రికెట్ రంగంలో ఆయన సాధించిన విజయం యావత్ భారతదేశానికే ఎంతో గర్వకారణమని కొనియాడారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తన ఆనందాన్ని పంచుకున్నారు. "నా మిత్రుడు జై షా రెండో విడతగా ఐసీసీ ఛైర్మన్‌గా తిరిగి నియమితులు కావడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. ఆయన ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అనేది క్రికెట్ ప్రపంచంలో ఆయన సంపాదించుకున్న అపారమైన విశ్వసనీయతను స్పష్టం చేస్తోంది. ఇది భారతదేశానికి గర్వకారణమైన క్షణం. క్రికెట్ క్రీడను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడంలో ఆయన సంపూర్ణ విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని లోకేశ్ పేర్కొన్నారు.ఇండోనేషియాలోని బాలి వేదికగా నిర్వహించిన ఐసీసీ బోర్డు సమావేశాల్లో సభ్యులంతా కలిసి జై షాను రెండోసారి ఛైర్మన్‌గా ఎన్నుకోవాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు.

17 ఏళ్లుగా జైల్లో ఉన్నారు.. బెయిల్ ఇస్తున్నాం!

బిల్కిస్‌బానో కేసులో దోషుల పిటిషన్‌పై సుప్రీంకోర్టు సంచలన ఉత్తర్వులు

నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త);

బిల్కిస్ బానో సామూహిక అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఇద్దరు దోషులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. దోషులైన బిపిన్‌చంద్ జోషి, ప్రదీప్ మోధియాలకు బెయిల్ మంజూరు చేస్తూ, వారి జీవిత ఖైదును సర్వోన్నత న్యాయస్థానం సస్పెండ్ చేసింది. ఇప్పటికే 17 ఏళ్లకు పైగా జైలు జీవితం గడపడం, వారి అప్పీల్‌లో వాస్తవాలు, చట్టపరమైన అంశాలను పరిగణించాల్సి ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు న్యాయస్థానం ఉత్తర్వుల్లో కోర్టు పేర్కొంది.తమ శిక్షపై 2017 మేలో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ జోషి, మోధియా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా దోషుల్లో ఒకరైన జోషి తీవ్ర వికలాంగుడనే విషయాన్ని కూడా ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది.అయితే, నేర తీవ్రత దృష్ట్యా దోషులకు బెయిల్ ఇవ్వడాన్ని ప్రభుత్వ తరపు న్యాయవాది వ్యతిరేకించారు. దీనిపై దోషుల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రాథమిక ఎఫ్ఐఆర్‌లో ఒక దోషి పేరు లేదని, ఘటన జరిగిన మూడేళ్ల తర్వాత కేసులో ఇరికించారని తెలిపారు. బాధితురాలు కూడా పోలీసులకు లేదా వైద్య పరీక్షల సమయంలో వీరి పేర్లను చెప్పలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేవలం గుంపులో ఉన్నారనే ఆరోపణ తప్ప, వారు నేరుగా నేరానికి పాల్పడినట్లు ఆధారాలు లేవని వాదించారు.ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ ఏడాది మార్చిలోనే నోటీసులు జారీ చేసింది. కాగా, 2024 జనవరిలో 11 మంది దోషుల ముందస్తు విడుదలను సుప్రీంకోర్టు రద్దు చేసిన విషయం తెలిసిందే. తాజా బెయిల్ పొందిన ఈ ఇద్దరు కూడా ఆ 11 మందిలో ఉన్నారు.

ఎన్నికల్లో రిజర్వేషన్ల అధికారం రాష్ట్రాలదే

మొదటిపేజీ తరువాయి

నాగ్‌పూర్ బెంచ్ 2025 సెప్టెంబరులో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఈ పిటిషన్ దాఖలు చేశారు. గతంలో ఉన్న రిజర్వేషన్ క్రమాన్ని పక్కన పెట్టి కొత్త రొటేషన్ విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల తదుపరి రిజర్వేషన్ పొందాల్సిన నియోజకవర్గాలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు.

ఫిలిప్పీన్స్‌లో మోదీ పర్యటన

మొదటిపేజీ తరువాయి

ఆసియాన్ దేశాలతో భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం.నవంబర్ 16న మనిలా చేరుకున్న మోదీకి అక్కడి అధికారులు, భారతీయ ప్రవాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ నిర్వహించిన ప్రత్యేక విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఉన్న సాంస్కృతిక సంబంధాలను ప్రతిబింబించే కార్యక్రమాలను వీక్షించారు. ఫిలిప్పీన్స్ సంప్రదాయ దుస్తులు ధరించి విందులో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ పర్యటనలో భారత్, ఆసియాన్ దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ సహకారం, డిజిటల్ సాంకేతికత, రవాణా అనుసంధానం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నాయి. ముఖ్యంగా సముద్ర భద్రత, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడంపై నేతలు దృష్టి సారించనున్నారు.

ఓటుకు వెయ్యి, ఉచిత ప్రయాణం!..

మొదటిపేజీ తరువాయి

ఆంధ్రా ఓటర్లపై దృష్టి సారించాయి. ఓటు వేసేందుకు వారిని సొంత గ్రామాలకు రప్పించేందుకు నగదు, ఉచిత ప్రయాణం వంటి ప్రలోభాలను ఎరగా వేస్తూ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి.

రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం, ఏపీలో పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో జరగనున్నాయి. నవంబర్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 13,000 సర్పంచ్, 1.32 లక్షల వార్డు సభ్యుల స్థానాలకు ఈ ఎన్నికలు జరుగుతుండగా, మొత్తం 2.61 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తొలి విడత నామినేషన్ల గడువు నవంబర్ 17తో ముగియనుండటంతో ప్రచారం మరింత హోరాహోరీగా మారనుంది.

ఈ నేపథ్యంలో, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, అమీర్‌పేట, మియాపూర్, బేగంపేట వంటి ప్రాంతాల్లో ఆంధ్రా ఓటర్లు అధికంగా నివసించే చోట్ల అభ్యర్థులు, వారి అనుచరులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఓటర్ల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ, పోలింగ్ రోజున తప్పనిసరిగా గ్రామానికి వచ్చి ఓటు వేయాలని కోరుతున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ సర్పంచ్ అభ్యర్థి, తన గ్రామానికి చెందిన ఓటర్లకు ఓటుకు రూ.1,000 చొప్పున (ఒక కుటుంబంలో ఐదు ఓట్లు ఉంటే రూ.5,000), ప్రయాణ ఖర్చులు అదనంగా ఇస్తానని ఆఫర్ చేసినట్లు సమాచారం.

ఇరిగేషన్ పై ఫోకస్

మొదటిపేజీ తరువాయి

సమావేశమై వినతిపత్రాలు సమర్పించారు. తాజాగా ఈ ప్రాజెక్టు విషయంలో సీఎం రేవంత్ రంగంలోకి దిగారు.సమ్మక్కసాగర్ బ్యారేజీతో ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకునే ముంపుపై ఆ రాష్ట్ర ప్రభుత్వం ఖరగ్‌పూర్ ఐఐటీతో అధ్యయనం చేయించగా.. బ్యారేజీ వద్ద 87 మీటర్ల గరిష్ఠ వరదతో 100 ఎకరాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని తేలింది. బ్యారేజీ పూర్తిస్థాయి నీటినిల్వ 83 మీటర్లు కాగా... అక్కడిదాకా ముంపునకు గురయ్యే భూములకే పరిహారం చెల్లిస్తామని తెలంగాణ ప్రభుత్వం ఇదివరకే తేల్చిచెప్పింది. అయితే గరిష్ఠ వరద 2022 జూలై 17, 19వ తేదీల్లో 88 మీటర్ల దాకా రికార్డయిందని, ఆ మేరకు ముంపునకు గురయ్యే భూములకు కూడా పరిహారం చెల్లించాలని ఛత్తీస్‌గఢ్ పట్టుబట్టింది. తాజాగా ఐఐటీ-ఖరగ్‌పూర్‌తో చేయించిన అధ్యయనంతో ముంపు 100 ఎకరాలుగా స్పష్టత వచ్చింది. తెలంగాణ విజ్ఞప్తితో ఛత్తీస్‌గఢ్ అధికారులు బ్యారేజీని 2023 సెప్టెంబరు 6-9వ తేదీల్లో పరిశీలించారు. ఆ తర్వాత సర్వే చేసి, ముంపునకు గురయ్యే ప్రాంతాలను సత్వరం గుర్తించి, భూసేకరణ ప్రక్రియను వేగిరం చేయాలని ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌ను తెలంగాణ అధికారులు కోరారు.

రూ.9,257 కోట్లతో చేపట్టిన తుపాకులగూడెం బ్యారేజీలో 95 శాతం మేర పనులు కూడా పూరయ్యాయి. ఈ బ్యారేజీలో నీటిని నిల్వ చేసి.. బ్యాక్‌వాటర్‌ను దేవాదుల ఎత్తిపోతల పథకం కింద ఎత్తిపోయడం ద్వారా పూర్వ ఖమ్మం, న ల్లగొండ, వరంగల్ జిల్లాలకు నీరందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. అయి తే గత ప్రభుత్వంలో రాజకీయంగా ఎన్‌వోసీ కోసం ప్రయత్నించిన దాఖలాలు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఈ ప్రయత్నాలు జరిగాయి. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగుతుండటంతో ప్రాజెక్టు ఎన్‌వోసీపై సానుకూల సంకేతాలు వస్తున్నాయి. మరోవైపు నీటిపారుదల శాఖ అధికారుల బృందం ఇప్పటికే నయా రాయ్‌పూర్‌కు చేరుకుంది. కాగా, 2011లో 10 శాతం కమాండ్ ఏరియాను మాత్రమే ధ్రువీకరించి, ఈ ప్రాజె క్టు డీపీఆర్‌ను దాఖలు చేశారు. నీటిపారుదల శాఖ సమర్పించిన సీడీవో (సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్) సర్టిఫికెట్‌పై సీడబ్ల్యూసీ తాజాగా అభ్యంతరం తెలుపుతూ డీపీఆర్‌ను ఇటీవలే వెనక్కి పంపించింది. వాస్తవానికి ఈ ప్రాజెక్టులో కీలకమైన ఆయకట్టు స్థిరీకరణపై సీడబ్ల్యూసీ చాలా రోజులుగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ప్రస్తుతం ఆయకట్టుపై పూర్తి స్పష్టత రావడంతో ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ తెచ్చుకొని.. మళ్లీ డీపీఆర్ దాఖలు చేయనుంది.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు తక్షణమే అమలు చేయాలి

మంత్రి వాకిటి శ్రీహరికి బీఎన్ఆర్కేఎస్ నేతల వినతి.. -అసెంబ్లీలో కార్మికుల గళం వినిపించాలని విజ్ఞప్తి

పథకాలు అమలు చేస్తే పాలాభిషేకం.. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం?- గిన్నారపు మహేందర్

ధర్మసాగర్/వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరో నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): రాష్ట్రంలోని భవన నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అందాల్సిన సంక్షేమ పథకాలన్నింటినీ తక్షణమే అమలు చేసి, అర్హులైన ప్రతి కార్మికుడికి న్యాయం చేయాలని బీఎన్ఆర్కేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్ ప్రభుత్వాన్ని కోరారు. భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధరిపల్లి చంద్రం ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి కార్మికుల సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు అందాల్సిన పథకాలు పూర్తిస్థాయిలో అమలుకాకపోవడంతో వేలాది మంది కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి వాకిటి శ్రీహరి కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు మహేందర్ తెలిపారు.

అనంతరం మహేందర్ మాట్లాడుతూ.. మానవ సమాజానికి అందమైన రాజభవనాలు, భారీ భవనాలు నిర్మిస్తున్న కార్మికులకు మాత్రం కనీసం నీడ, భద్రమైన జీవనం కూడా లేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు తమ శ్రమ, చెమటను ధారపోసి భవనాలు నిర్మిస్తున్న కార్మికుల జీవితాల్లో మాత్రం వెలుగులు నిండడం లేదన్నారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం గత రెండు





దశాబ్దాలుగా ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేశామని గుర్తుచేశారు. 1996 భవన నిర్మాణ కార్మికుల చట్టం సాధన కోసం ఎంతోమంది కార్మికులు శ్రమించి, ప్రాణత్యాగాలు చేశారని తెలిపారు. రాస్తారోకోలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాల ద్వారా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి చట్టం సాధనలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేయగా, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చట్టం నిర్వీర్యమైందని విమర్శించారు. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కార్మికుల్లో కొత్త ఆశలు చిగురించాయని, గతంలో నిలిచిపోయిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించి చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని కోరారు. కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డు లక్ష్యం నెరవేరాలంటే అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలని స్పష్టం చేశారు. ఈ సమస్యలపై మంత్రి వాకిటి శ్రీహరి అసెంబ్లీలో కార్మికుల తరఫున గళం వినిపించి, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తే రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులందరి తరఫున ప్రభుత్వానికి పాలాభిషేకం చేస్తామని మహేందర్ ప్రకటించారు. అలా కాకుండా నిర్లక్ష్యం కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

: జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ



తల్లాడ/ నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర నాయకుడు దయానంద్ ఆధ్వర్యంలో సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన పార్టీ కమిటీలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గత మూడేళ్లుగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించడంతో పాటు పార్టీ ఆశయాలు, విధానాలను ప్రజలకు చేరవేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని నూతన కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, తల్లాడ మండల ఇన్‌చార్జి మూడుమంతల గంగరాజు, కొట్టే రాజశేఖర్, రంగా జనార్దన్, మద్దినేని రమేష్, సురేష్, అఫ్జల్, బాలాజీ నాయక్, వేల్పుల మురళి, జె. వినయ్, స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న జక్కంపూడి కిషోర్



తల్లాడ/ నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమంలో జక్కంపూడి కిషోర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మాలధారణ చేసిన భక్తులు నియమ నిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో స్వామివారి దీక్షను కొనసాగించాలని ఆకాంక్షించారు. బిల్లుపాడు గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అయ్యప్ప స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తి, ఆధ్యాత్మికతతో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సామినేని రామప్పరావు, జక్కంపూడి రమేష్, ఎనిక నరసింహారావు, అయ్యప్ప స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.ం

ధర్మసాగర్‌లో ఈ నెల 18న సీపీఐ మహాధర్నా

అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

కరువు మండలంలోని గ్రామాలకు రేషన్ ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి

ధర్మసాగర్/వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరో నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ధర్మసాగర్ మండల సీపీఐ శాఖ సమావేశం ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మండల సహాయ కార్యదర్శి కనుక రాజన్న, గ్రామ కార్యదర్శి చిలుక బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు



మాట్లాడుతూ కరువు మండలంగా ప్రకటించిన ధర్మసాగర్ మండలంలోని గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మండలంలోని అన్ని గ్రామాల రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను ఎలాంటి రాజకీయ జోక్యం, అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నిజమైన నిరుపేదలకు ఇళ్లు అందకుండా అన్యాయం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. మండలంలో నెలకొన్న ఇతర ప్రజా సమస్యలు, వివిధ శాఖల్లో జరుగుతున్న అవకతవకలపై సమావేశంలో చర్చించారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఈ మహాధర్నాకు ప్రజలు, పార్టీ కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో మండల శాఖ కోశాధికారి రాజారపు రత్నం, వల్లెపు వెంకన్న, సాయిపేట లచ్చన్న, సీనియర్ నాయకురాలు ఆరూరి భాగ్యలక్ష్మి, బొంత సంపత్, కస్తూరి రాజయ్య, కుంచపు ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి మున్సిపల్ చైర్మన్ పరామర్శ





వర్ధన్నపేట/నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):
వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు భవానీకుంట తండాకు చెందిన నునవత్ తారా అనారోగ్యంతో మృతి చెందగా, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు మృతురాలి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి, కౌన్సిలర్ మాలోతు దేవేందర్, బెజ్జం పాపారావు, నునవత్ కమిలి, కిమా నాయక్, రాచంద్రరెడ్డి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

వేములపల్లి, మాడుగులపల్లి మండలాల లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ

మిర్యాలగూడ/ నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) అన్నారు. వేములపల్లి, మాడుగులపల్లి మండలాలకు చెందిన నూతనంగా చేయూత పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందని తెలిపారు. పేదలు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో





చేయూత పింఛన్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు.

ప్రజల అవసరాలను గుర్తించి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి

హసన్‌పర్తి మండలంలో విద్యార్థుల నుంచి వినతుల స్వీకరణ

హసన్‌పర్తి/నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):
పిల్లల హక్కుల పరిరక్షణతో పాటు వారి సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా హసన్‌పర్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సోమవారం ప్రత్యేక పిల్లల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రతి వారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా పాఠశాలల ముందు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటోందని, దీంతో విద్యార్థులు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల





భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలల సమీపంలో ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లల హక్కుల పరిరక్షణకు ప్రజావాణి ఒక మంచి వేదిక అని పేర్కొన్నారు. ఇంట్లో, పాఠశాలలో లేదా సమాజంలో ఎక్కడైనా పిల్లలు సమస్యలు ఎదుర్కొన్నా, ఎవరైనా వేధింపులకు గురిచేసినా నిర్భయంగా ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చని, వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను విద్యార్థులకు పరిచయం చేస్తూ ఆయా శాఖల విధులు, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. పిల్లలు తమ సమస్యలను దాచుకోకుండా ధైర్యంగా అధికారులకు తెలియజేయాలని, చిన్నతనం నుంచే తమ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుమనవాణి, స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, ఉపాధ్యాయులు నితిన్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఒకే ఒక్క దరఖాస్తు



వర్ధన్నపేట, నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఒకే ఒక్క దరఖాస్తు అందింది. గృహ నిర్మాణానికి సంబంధించి వచ్చిన దరఖాస్తును ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ విజయసాగర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రజా పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

ప్రజా కళలకు జన్ను రాజు సేవలు

జన్ను రాజుకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సేవారత్న అవార్డు ప్రదానం



వరంగల్/నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): ప్రజా సమస్యలను కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తూ, కళల పరిరక్షణకు కృషి చేస్తున్న వరంగల్ జిల్లా సంగెం మండలం షాపూర్ గ్రామానికి చెందిన కళాకారుడు జన్ను రాజుకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సేవారత్న అవార్డు-2026 లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. అరుంధతి కల్చరల్ ఫౌండేషన్ ద్వారా అందించిన సేవలను గుర్తించి శ్రీ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ జాతీయ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ వి.ఆర్. శ్రీనివాసరాజుకు జన్ను రాజు కృతజ్ఞతలు తెలిపారు.షాపూర్ గ్రామానికి చెందిన జన్ను స్వామి, ఎల్లమ్మ దంపతుల రెండో సంతానమైన రాజుకు చిన్ననాటి నుంచే కళారూపాలపై ఆసక్తి ఉంది. 1996 నుంచి కళలపై మక్కువ పెంచుకున్న ఆయన, 2001లో పదో తరగతి పూర్తయిన అనంతరం గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలపై నాటకాలు, నృత్యాలు ప్రదర్శిస్తూ పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించారు. పలువురు యువకులను కళాకారులుగా తీర్చిదిద్దారు. 2010లో మౌనికను వివాహం చేసుకున్న అనంతరం ఆమె తన కళా ప్రయాణంలో ఎంతో ప్రోత్సాహం అందించిందని తెలిపారు.తర్వాత తెలంగాణ ప్రజానాట్యమండలిలో చేరి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో పాల్గొన్నారు. వీర తెలంగాణ వీధినాటిక, పల్లె కళలు, లంకె బిందెలు తదితర నాటకాలను ప్రదర్శించారు. అంతరించిపోతున్న జానపద, ప్రజా కళలకు పునరుజ్జీవం కల్పించడంతోపాటు కళాకారులు ప్రజా సమస్యలపై స్పందిస్తూ అన్యాయాన్ని ఎదిరించాలని ఆయన ఆకాంక్షించారు.

రైతుల సంక్షేమమే మధుకాన్ లక్ష్యం

నష్టాలు ఎదురైనా కర్మాగారాన్ని కొనసాగిస్తున్నాం- 2026-27 చెరకు గానుగ సీజన్ ప్రారంభించిన మాజీ ఎంపీ నామ





నేలకొండపల్లి/నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): రైతుల సంక్షేమమే ధ్యేయంగా మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీని కొనసాగిస్తున్నామని సంస్థ వ్యవస్థాపకులు, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తెలిపారు. నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలోని మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో 202627 చెరకు గానుగ సీజన్‌ను సోమవారం ప్రారంభించారు. నామ నాగేశ్వరరావు తన సతీమణి చిన్నమ్మతో కలిసి ఉదయం 9.54 గంటలకు చెరకు గడలను గానుగలో వేసి సీజన్‌కు శ్రీకారం చుట్టారు. తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించి కర్మాగారం అభివృద్ధి, గానుగ సీజన్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

26 ఏళ్లలో 22 ఏళ్లు నష్టాలే

ఈ సందర్భంగా చెరకు రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో నామ సమావేశమయ్యారు. చక్కెర పరిశ్రమలు ప్రస్తుతం తీవ్ర ఆర్థిక, నిర్వహణపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. మధుకాన్ కర్మాగారం 26 ఏళ్ల నిర్వహణలో కోజనరేషన్ విద్యుత్ ఉత్పత్తి విభాగంలో రెండేళ్లు, చక్కెర ఉత్పత్తి విభాగంలో మరో రెండేళ్లు మాత్రమే లాభాలు ఆర్జించిందని వివరించారు. మిగిలిన 22 ఏళ్లు నష్టాలను ఎదుర్కొన్నప్పటికీ రైతులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో కర్మాగారాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక చక్కెర కర్మాగారాలు నష్టాలను భరించలేక మూతపడ్డాయని గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు, కర్మాగారం పరస్పర సహకారంతో ముందుకు సాగాలని కోరారు. రైతుల సహకారం ఉంటేనే పరిశ్రమ మనుగడ సాధ్యమని పేర్కొన్నారు.

రైతుల కష్టాలు నాకు తెలుసు

తన తండ్రి స్వర్గీయ ముత్తయ్య కూడా రైతేనని, తాను రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని నామ తెలిపారు. రైతుల కష్టాలు, వారి జీవన పరిస్థితులు తనకు తెలుసన్నారు. రైతులకు మేలు చేయాలనే సంకల్పంతోనే మధుకాన్‌ను నిర్వహిస్తున్నామని, దీని వెనుక లాభాపేక్ష లేదని స్పష్టం చేశారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారి ప్రయోజనాలను కాపాడటమే ప్రధాన లక్ష్యమన్నారు. కర్మాగారం అభివృద్ధికి రైతులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని, ప్రస్తుత గానుగ సీజన్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రైతులకు అల్పాహారం వడ్డించిన నామ

గానుగ ప్రారంభోత్సవం అనంతరం నామ దంపతులు చెరకు రైతులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. నామ స్వయంగా రైతులకు అల్పాహారం వడ్డించి వారితో ఆత్మీయంగా మాట్లాడారు. అనంతరం రైతులు, కర్మాగార సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, శ్రేయస్సును కాంక్షిస్తూ సుదర్శన హోమం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన పూజా కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. పూజారులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు ఇచ్చారు. కార్యక్రమంలో నామ కుటుంబ సభ్యులు, సంస్థ ఏవీపీ కోటయ్య, శ్రేయోభిలాషులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, చెరకు రైతులు, కర్మాగార అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ప్రజల నమ్మకం కరువైందా..

18 నుంచి ఒక్కటికి పడిపోయిన దరఖాస్తులు!



వర్ధన్నపేట/నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన క్రమంగా తగ్గుతోంది. ఒకప్పుడు పదుల సంఖ్యలో వినతులు వచ్చేవి. ఇప్పుడు ఒక్క దరఖాస్తుతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వర్ధన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో ఆగస్టు 18న నిర్వహించిన ప్రజావాణికి 18 దరఖాస్తులు అందగా. నవంబర్ 16న నిర్వహించిన కార్యక్రమానికి కేవలం ఒక్కటే రావడం చర్చనీయాంశంగా మారింది. మూడు నెలల వ్యవధిలో వినతుల సంఖ్య గణనీయంగా పడిపోవడం అధికార యంత్రాంగం ఆలోచించాల్సిన అంశంగా కనిపిస్తోంది.

శాఖల వారీగా సమస్యలు. పరిష్కారాలపై ప్రశ్నలు

గతంలో రెవెన్యూ, గృహ నిర్మాణం, పోలీసు, మున్సిపాలిటీ, విద్యుత్, నీటిపారుదల, ఆర్టీసీ, ఎక్సైజ్, పంచాయతీరాజ్ తదితర శాఖలకు సంబంధించి ప్రజలు వినతులు సమర్పించారు. సమస్యల తీవ్రత ఉన్నప్పుడు ప్రజలు ప్రజావాణిని ఆశ్రయించారు. అయితే ప్రస్తుతం దరఖాస్తుల సంఖ్య ఎందుకు తగ్గిందన్నది అంతుచిక్కడం లేదు. ప్రజల సమస్యలు పరిష్కారమై ఫిర్యాదులు తగ్గాయా? లేక దరఖాస్తులు ఇచ్చినా ఫలితం ఉండదనే భావన ప్రజల్లో ఏర్పడిందా? ప్రజావాణి నిర్వహణపై ప్రచారం, అవగాహన తగ్గిందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

స్వీకరణకే పరిమితమా. పరిష్కారమే లక్ష్యమా?

ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను స్వీకరించడం ఒక ఎత్తయితే, వాటికి పరిష్కారం చూపించడం మరో ఎత్తు. గతంలో వచ్చిన 65 దరఖాస్తుల్లో ఎన్ని పరిష్కరించారు? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? బాధితులకు పరిష్కార వివరాలు తెలియజేస్తున్నారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. అధికారులు కేవలం దరఖాస్తుల సంఖ్యను నమోదు చేయడానికే పరిమితం కాకుండా, ప్రతి ఫిర్యాదుపై చర్యల పురోగతిని సమీక్షించాలి. ప్రజావాణిపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు మండల స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. ఒక్క దరఖాస్తు రావడం సమస్యలు లేవనే సంకేతమా? లేక ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికే వెనుకాడుతున్నారా? అన్నది అధికారులే తేల్చాలి.అధికారుల సమక్షంలో నిర్వహించిన నవంబర్ 16 ప్రజావాణిలో ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ విజయ్ సార్ తో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పార్టీ కార్యాలయం పనిచేయాలి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

ఎల్కతుర్తి/ నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఇంప్లిమెంటేషన్ ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్, హసన్‌పర్తి పీఏసీఎస్ చైర్మన్ పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే వేదికగా పార్టీ కార్యాలయం నిలవాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే పార్టీ ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, సొసైటీ బ్యాంకు చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పుల్లూరి శ్రీధర్ రావు, ప్రజాప్రతినిధులు ముప్పు మహేందర్, శ్రీకాంత్, పలువురు సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





విద్యార్థుల విజయమే గ్రామాభివృద్ధికి పునాది

పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ ఏర్పాటు చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి



కేసముద్రం/ నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): విద్యార్థుల విజయమే గ్రామాభివృద్ధికి పునాది అని మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి ఆకాంక్షించారు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం కల్వల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి, పట్టుదలతో చదివి పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా కల్వల పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి, ఐఐటీ బాసరలో అత్యధిక సీట్లు సంపాదించి గ్రామ కీర్తిని చాటాలని ఆకాంక్షించారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు నిరంతరం శ్రమించాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారికి ప్రోత్సాహం అందించేందుకు స్నాక్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్, గ్రామ సర్పంచ్ వేల్పుల సుజాత రామచంద్రయ్య, ఉపసర్పంచ్ పెదగాని రవి, గండి శ్రీనివాస్, గంట బాలకృష్ణారెడ్డి, గంట రాంమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి భగవద్గీత.. ప్రతి ఒక్కరికీ శ్రీకృష్ణుడి సందేశం

భగవద్గీత పుస్తకాల పంపిణీ చేసిన నారాబోయిన శ్రీనివాస్ కళ్యాణ్

ఇంటింటికీ గీతా జ్ఞానాన్ని చేరవేయడమే లక్ష్యం



స్టేషన్ ఘన్‌పూర్ /నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): ప్రతి ఇంటికి భగవద్గీతను చేరవేస్తూ, ప్రతి ఒక్కరికీ శ్రీకృష్ణుడి జీవిత సందేశాన్ని అందించాలనే గొప్ప సంకల్పంతో మండలంలోని తాటికొండ గ్రామంలో భగవద్గీత సందేశ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో నారాబోయిన శ్రీనివాస్ కళ్యాణ్ (కొమురయ్య) ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ మారపాక సుజనా శ్రీనివాస్ భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా నారాబోయిన శ్రీనివాస్ కళ్యాణ్ మాట్లాడుతూ గతంలో 25 మందికి భగవద్గీత పుస్తకాలను అందించామని, ప్రస్తుతం మరో 45 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంటింటికీ భగవద్గీతను చేర్చాలనే లక్ష్యంతో త్వరలోనే మరింత మందికి పుస్తకాలను అందజేస్తామని వెల్లడించారు. భగవద్గీత సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి అందించిన దివ్యజ్ఞానమని, జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవడం, మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడం, కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వహించడం, భగవంతుడిపై భక్తి, విశ్వాసాలను పెంపొందించుకోవడం వంటి విలువైన సందేశాలను భగవద్గీత బోధిస్తుందని వివరించారు.
భగవద్గీత కేవలం చదివి పక్కన పెట్టే గ్రంథం కాదని, అందులోని జ్ఞానాన్ని నిత్యజీవితంలో ఆచరించినప్పుడే నిజమైన ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదివి అందులోని సందేశాలను తమ జీవితాల్లో పాటించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికి భగవద్గీత చేరడంతోపాటు ప్రతి ఒక్కరి జీవితంలో శ్రీకృష్ణుడి జ్ఞానజ్యోతి వెలగాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.
అంగన్వాడీ టీచర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎడమ కట్టమల్లు, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు పద్మ, సులోచన, అరుణాదేవి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం మహా పుణ్యప్రదం

41 రోజుల అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్

కేసముద్రం/నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): అయ్యప్ప స్వామి మాలధారణ చేసి మండల దీక్ష చేపట్టిన భక్తులకు అన్నదానం చేయడం మహా పుణ్యప్రదమైన సేవ అని కేసముద్రం మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రామ నాగేశ్వర్ రావు పేర్కొన్నారు.అయ్యప్ప స్వాముల సేవే లక్ష్యంగా కేసముద్రం పట్టణంలోని ఉప్పరపల్లి రోడ్డులో ఉన్న శ్రీ ధర్మశాస్త్ర ఆలయం వద్ద 41 రోజుల పాటు నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం వారు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో అయ్యప్ప స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మాలధారణ చేసి కఠిన నియమ నిష్ఠలతో మండల దీక్ష చేపట్టిన భక్తులకు అన్నదానం చేయడం ఎంతో పవిత్రమైన కార్యమని అన్నారు. భక్తులు దీక్షా కాలంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. 41 రోజుల పాటు నిరంతరాయంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా అయ్యప్ప స్వాముల పట్ల భక్తితో పాటు సేవాభావాన్ని చాటుకోవడం గొప్ప విషయమన్నారు.
ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, అయ్యప్ప స్వామి భక్తులు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థులే సామాజిక మార్పునకు చోదకశక్తులు





ఆలేరు/నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):
సామాజిక న్యాయం, సమానత్వం సాధించాలంటే విద్యార్థులు ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ అన్నారు. సోమవారం ఆలేరు పట్టణంలోని గౌడ భవన్‌లో నల్ల చంద్రస్వామి మాదిగ అధ్యక్షతన నిర్వహించిన మాదిగ విద్యార్థుల సదస్సులో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో మాదిగ విద్యార్థులు అద్వితీయ పాత్ర పోషించారని, అదే స్ఫూర్తితో కుల, మత, వర్గ, లింగ వివక్షతలు లేని సమాజ నిర్మాణానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల శక్తితోనే ఉద్యమాలు విజయవంతమవుతాయని, మహనీయుల ఆశయాల సాధనకు విద్యార్థులు సిద్ధం కావాలని అన్నారు. ప్రతి విద్యాసంస్థ, వసతి గృహంలో విద్యార్థులను చైతన్యపరుస్తూ నూతన కమిటీలు ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామం, మండలంలో విద్యార్థులను సంఘటితం చేసి భవిష్యత్తు ఉద్యమాలకు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి కోళ్ల శివ మాదిగ, సందే కార్తీక్ మాదిగ, నల్ల చంద్రస్వామి మాదిగ, దుబ్బ రామకృష్ణ మాదిగ, మంద శంకర్ మాదిగ, వరుణ్ మాదిగ, కందుల నర్సింగరావు మాదిగ, పుల్లూరి రవి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల చొరవతో గ్రామంలో పలు సంక్షేమ పథకాల అమలు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి.. సర్పంచ్ పుల్లూరు శ్రీధర్‌రావు



ఎల్కతుర్తి/నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):
గ్రామంలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క చొరవ చూపుతున్నారని వీరనారాయణపూర్ గ్రామ సర్పంచ్ పుల్లూరు శ్రీధర్‌రావు తెలిపారు. మంత్రుల ఆదేశాలు, సహకారంతో గ్రామంలో వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు చేయూత పింఛన్లు, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, రహదారుల నిర్మాణం, మహిళలకు వడ్డీలేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ ప్రజలు సంతృప్తిగా వినియోగించుకుంటున్నారని తెలిపారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి సీతక్కకు గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో ఎల్కతుర్తి మండల అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు గ్రామాలకు అదనపు నిధులు కేటాయించి, మరిన్ని సంక్షేమ పథకాలు అందేలా చొరవ తీసుకోవాలని సర్పంచ్ పుల్లూరు శ్రీధర్‌రావు కోరారు.

12 గంటల్లోనే బాలుడి ఆచూకీ

మూడు ప్రత్యేక బృందాలతో గాలింపు.. భద్రాద్రి కొత్తగూడెంలో గుర్తింపు



కేసముద్రం/నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):
తప్పిపోయిన ఆరేళ్ల బాలుడిని కేసముద్రం పోలీసులు 12 గంటల్లోనే గుర్తించి క్షేమంగా తండ్రికి అప్పగించారు. మూడు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బాలుడి ఆచూకీ కనిపెట్టారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ కుటుంబం ఉపాధి కోసం కేసముద్రం ప్రాంతానికి వచ్చి స్థానిక పరిశ్రమలో పనిచేస్తోంది. ఈ క్రమంలో తండ్రి మందలించడంతో ఆరేళ్ల బాలుడు కదరి రాయ్‌సింగ్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశాలతో కేసముద్రం పోలీసులు మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషిస్తూ వివిధ ప్రాంతాల్లో వెతికారు. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బాలుడిని గుర్తించారు. అనంతరం డీఎస్పీ తిరుపతిరావు, ఎస్ఐ క్రాంతికిరణ్, కానిస్టేబుళ్లు మోహన్, రాజు బాలుడిని కేసముద్రం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి తండ్రికి అప్పగించారు. బాలుడిని సురక్షితంగా తండ్రి చెంతకు చేర్చడంలో చొరవ చూపిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. బాలల భద్రతకు పోలీసు శాఖ ప్రాధాన్యమిస్తుందని, అదృశ్యమైన వారి ఆచూకీ కోసం తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

హసన్‌పర్తిలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఐదుగురు అరెస్ట్.. నగదు, సెల్‌ఫోన్లు, పేకముక్కలు స్వాధీనం





హసన్‌పర్తి/నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెంబర్తి గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో పెంబర్తి గ్రామంలోని చకలివాడలో చంద్రగిరి శేఖర్ ఇంటి ముందు బహిరంగ ప్రదేశంలో కొందరు వ్యక్తులు డబ్బులు పణంగా పెట్టి మూడు ముక్కల పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన ఐదుగురిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిని పెంబర్తికి చెందిన చంద్రగిరి శేఖర్ (58), తీగల సమ్మయ్య (59), వల్లాల ఐలయ్య (57), హసన్‌పర్తికి చెందిన నరిహరి లక్ష్మారెడ్డి (46), హనుమకొండకు చెందిన వేముల రమేష్ (49)గా గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.5 వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు, 104 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించి, నిందితులను స్వాధీనం చేసుకున్న సొత్తుతో సహా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ హెచ్చరించారు.

రహదారులపై రక్తపుటేరులు



బైకు ప్రయాణం ప్రాణసంకటమేనా?

అజాగ్రత్తకు బలవుతున్న యువత.. హెల్మెట్ నిర్లక్ష్యం.. వేగానికి చెల్లిస్తున్న మూల్యం!



హైదరాబాద్ /నవంబర్ 16(జర్నలిస్ట్ వార్త):
రెండు చక్రాల వాహనం సామాన్యుడి ప్రయాణ సాధనం. ఉద్యోగానికి వెళ్లాలన్నా. విద్యార్థులు కళాశాలకు చేరుకోవాలన్నా. రైతులు, చిరు వ్యాపారులు తమ పనులు చేసుకోవాలన్నా బైకే ప్రధాన ఆధారం. కానీ అదే బైకు నేడు అనేక కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్న వాహనంగా మారుతోంది. క్షణకాలపు నిర్లక్ష్యం.. మితిమీరిన వేగం.. హెల్మెట్ ధరించకపోవడం. రహదారి నిబంధనలను పట్టించుకోకపోవడం. వెరసి విలువైన ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత హడావుడి చేయడం కంటే ముందే నివారణ చర్యలు తీసుకోవడంలో వ్యవస్థలు ఎందుకు విఫలమవుతున్నాయన్నది ప్రశ్న.

వేగమే ప్రధాన శత్రువా?
యువతలో కొందరు బైకును ప్రయాణ సాధనంగా కాకుండా వేగాన్ని ప్రదర్శించే సాధనంగా భావిస్తున్నారు. రహదారులపై పోటీ పడటం, ప్రమాదకరంగా వాహనాలను నడపడం, ఒకే బైకుపై ముగ్గురు ప్రయాణించడం, వాహనం నడుపుతూనే సెల్‌ఫోన్ వినియోగించడం వంటి చర్యలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మద్యం సేవించి వాహనాలు నడపడం పరిస్థితిని మరింత ప్రమాదకరంగా మారుస్తోంది. అయితే ప్రతి ప్రమాదానికి వాహనదారుడి నిర్లక్ష్యమే కారణమని చెప్పలేం. రహదారుల పరిస్థితి, వెలుతురు లోపం, హెచ్చరిక బోర్డుల కొరత, కూడళ్ల వద్ద నియంత్రణ లేకపోవడం కూడా ప్రమాదాలకు దారితీసే అంశాలే.

హెల్మెట్ తలకు భారమా.. కుటుంబానికి భరోసా?
హెల్మెట్ ధరించడం కొందరికి ఇప్పటికీ భారంగానే కనిపిస్తోంది. పోలీసులు కనిపించినప్పుడు మాత్రమే హెల్మెట్ పెట్టుకోవడం, కొంతదూరం వెళ్లగానే తొలగించడం అలవాటుగా మారుతోంది. ప్రమాద సమయంలో తలకు బలమైన గాయాలైతే ప్రాణాపాయం ఏర్పడే అవకాశం ఉంది. నాణ్యమైన హెల్మెట్ ధరించడం, దాని పట్టీని సరిగా బిగించుకోవడం ప్రాణరక్షణకు కీలకం. హెల్మెట్ కొనడానికి వెనుకాడే వారు ప్రమాదం తర్వాత ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ కుటుంబ సభ్యులకు అంతులేని వేదనను మిగులుస్తున్నారు.

ప్రమాదకర కూడళ్లపై నిఘా ఏది?
ప్రధాన రహదారులు, గ్రామీణ మార్గాలు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు అవసరం. రహదారులపై గుంతలు, మలుపుల వద్ద హెచ్చరిక సూచికలు లేకపోవడం, రాత్రివేళ వీధి దీపాలు వెలగకపోవడం, రహదారులపై అక్రమ పార్కింగ్ వంటి సమస్యలను అధికారులు గుర్తించాలి. ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను పరిశీలించి వాటిని ప్రమాదకర ప్రాంతాలుగా గుర్తించాలి. అవసరమైన చోట వేగ నియంత్రణ ఏర్పాట్లు, సూచిక బోర్డులు, రహదారి మరమ్మతులు చేపట్టాలి. ప్రమాదం జరిగిన తర్వాత పరామర్శలకు పరిమితం కాకుండా ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవడమే అసలైన బాధ్యత.

పోలీసుల చర్యలు కాగితాలకే పరిమితమా?
ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మద్యం సేవించి వాహనాలు నడిపేవారు, అతివేగంగా ప్రయాణించేవారు, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారిపై నిరంతర తనిఖీలు చేపట్టాలి. పాఠశాలలు, కళాశాలల్లో రహదారి భద్రతపై ప్రత్యేక అవగాహన కల్పించాలి. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి పోలీసు, రవాణా, రహదారుల శాఖలు సమన్వయంతో పనిచేయాలి.

ప్రాణం పోయాక పరిహారం ఇచ్చినా తిరిగొస్తుందా?
ఒక బైకు ప్రమాదంలో వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోతుంది. గాయపడితే వైద్య ఖర్చులు, ఉపాధి కోల్పోవడం, అప్పుల భారం కుటుంబాన్ని వెంటాడుతాయి. ముఖ్యంగా కుటుంబానికి ఆధారంగా ఉన్న యువకులు ప్రమాదాలకు గురైతే ఆ కుటుంబ భవిష్యత్తే ప్రశ్నార్థకమవుతుంది. ప్రమాదం జరిగిన తర్వాత పరిహారం, పరామర్శలు ఎంత చేసినా కోల్పోయిన ప్రాణాన్ని తిరిగి తీసుకురాలేవు. అందుకే రహదారి భద్రతను వ్యక్తిగత బాధ్యతగానే కాకుండా సామాజిక బాధ్యతగా చూడాలి.

అధికారుల ముందున్న అసలు సవాలు!
బైకు ప్రమాదాలపై పోలీసులు, రవాణా శాఖ, సంబంధిత అధికారులు సమగ్ర సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉంది. మండలాల వారీగా ప్రమాదాల సంఖ్య, మరణాలు, గాయపడిన వారి వివరాలు, ప్రమాదాలకు ప్రధాన కారణాలు, తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల జాబితాను ప్రజలకు వెల్లడించాలి. ప్రమాదకర కూడళ్లను గుర్తించి శాశ్వత పరిష్కారాలు చూపాలి. రహదారుల నిర్వహణలో నిర్లక్ష్యం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

చివరగా ఒక్క ప్రశ్న. బైకు ప్రమాదాలు జరిగినప్పుడు కేసులు నమోదు చేసి, బాధితులను ఆసుపత్రులకు తరలించడం వరకే అధికారుల బాధ్యత ముగుస్తుందా? లేక మరో ప్రాణం పోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కూడా ఉందా? వేగం తగ్గించుకోవడం వాహనదారుల చేతుల్లో ఉంటే. ప్రమాదకర రహదారులను సరిచేయడం, నిబంధనలు అమలు చేయడం అధికారుల చేతుల్లో ఉంది. ఈ రెండు బాధ్యతలు నెరవేరినప్పుడే రహదారులపై రక్తపుటేరులకు అడ్డుకట్ట పడుతుంది.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

చిల్పూరు మండలంలో 836 నూతన పెన్షన్లు మంజూరు

రాష్ట్రవ్యాప్తంగా 4.63 లక్షల మందికి కొత్త పెన్షన్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి





స్టేషన్ ఘన్‌పూర్/ నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. చిల్పూరు మండల కేంద్రంలోని వరలక్ష్మి గార్డెన్స్‌లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన చేయూత పెన్షన్లతోపాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్పూరు మండలంలోని 17 గ్రామాలకు 836 నూతన పెన్షన్లు మంజూరయ్యాయని వెల్లడించారు. దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులకు పెన్షన్లు అందిస్తున్నట్లు తెలిపారు.

గతంలో పెన్షన్ల కోసం పేదలు ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల ఇబ్బందులను గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా 4.63 లక్షల కొత్త చేయూత పెన్షన్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 45 లక్షల మందికి పెన్షన్లు అందుతున్నాయని, ఇందుకోసం ఏటా రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుతోపాటు మహిళలు, రైతులు, పేదల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

నూతనంగా ఏర్పడిన చిల్పూరు మండల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని చెప్పారు. తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.08 కోట్లు, ఎంపీడీవో కార్యాలయ నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయని, ఏటీసీ భవన నిర్మాణానికి కూడా నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. త్వరలోనే ఈ మూడు భవనాలకు శంకుస్థాపనలు నిర్వహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్, తహసీల్దార్ విజయ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిర్ర నాగరాజు, దిశా కమిటీ సభ్యుడు కొర్ర వెంకటేష్, సర్పంచులు ఎనగందుల నరసింహారెడ్డి, గుగులోత్ లక్ష్మీ ఉమ్లా నాయక్, ఇల్లందుల తిరుపతమ్మ, తీగల మహేందర్, నాయకులు బొమ్మిశెట్టి బాలరాజు, గడ్డమీద సురేష్, రంగు రమేష్, తాళ్లపెల్లి సమ్మయ్య, దామోదర్, రంజిత్ రెడ్డి, రూప్ల నాయక్, సంజీవ, రవీందర్, విజయ్, జక్కుల రాజయ్య, వెంకటేశ్వర్లు, కుమార్, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట.. అభివృద్ధే లక్ష్యం

రూ.10.80 కోట్ల పనులకు శంకుస్థాపన.. సంక్రాంతికి చెరువుకు గోదావరి జలాలు: మంత్రి తుమ్మల

సత్తుపల్లి/ నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): రైతుల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్‌లో రూ.10.80 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం చెల్లగుల్ల నరసింహారావు చైర్మన్‌గా నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సంక్రాంతి నాటికి వేశ్యాకాంతల చెరువుకు గోదావరి జలాలు అందిస్తామని తెలిపారు. వచ్చే మే నెల నాటికి మరిన్ని ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కల్లూరుగూడెం ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీతో ఈ ప్రాంతంలో సాగు విస్తరిస్తోందని, పామాయిల్‌తో పాటు కోకో, మిరియాలు సాగు చేసి రైతులు అధిక ఆదాయం పొందాలని సూచించారు. ఖమ్మం మార్కెట్ తరహాలో సత్తుపల్లి మార్కెట్‌ను ఆదర్శ మార్కెట్‌గా అభివృద్ధి





చేస్తామని వెల్లడించారు.

ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమంతో పాటు ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో 4,700 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయని, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి విడతలో 3,500, రెండో విడతలో మరో 2,000 ఇళ్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ రాహుల్ రాజ్, ఉప సంచాలకులు వి.పద్మావతి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఆర్.సంతోష్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ రేహానా బేగం, ప్రజాప్రతినిధులు, అధికారులు, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి మండలంలో 715 మందికి కొత్త పింఛన్లు

మంజూరు పత్రాలు పంపిణీ చేసిన మంత్రులు సీతక్క, పొన్నం





ఎల్కతుర్తి/నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 5,850 మందికి పింఛన్లు అందుతుండగా, తాజాగా మరో 715 మందికి మంజూరు చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4,63,857 మందికి పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా మరో అవకాశం కల్పిస్తామన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.75 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామన్నారు. ఈ నెల 19న ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభిస్తామని వెల్లడించారు.రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని, ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని, గ్రామాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో కోర్టులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎల్కతుర్తిలో త్వరలో నూతన బస్టాండ్ నిర్మిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పుల్లూరి శ్రీధర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, అధికారులు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శవాల ముందు డప్పు చప్పుళ్లు..

కన్నీటి వెనుక కులవృత్తి సంకెళ్లు!

మరణం ఒకరి ఇంట్లో విషాదం.మరో ఇంట్లో జీవనోపాధి!

శవయాత్రలో డప్పుల మోత. యువకుల నృత్యాలు.చూసేవారికి వినోదంగా కనిపిస్తున్నా, ఆ చప్పుళ్ల వెనుక తరతరాల సామాజిక వివక్ష, పేదరికం, తప్పనిసరి జీవనపోరాటం దాగి ఉన్నాయి. ఇది కళా ప్రదర్శనా? కులవృత్తి భారమా? మానవత్వం మౌనంగా ప్రశ్నిస్తున్న వేళ..

ఒక ఇంట్లో మనిషి చనిపోతే ఆ కుటుంబం కన్నీటి సంద్రంలో మునిగిపోతుంది. ఆత్మీయుడిని కోల్పోయిన బాధతో బంధువులు విలపిస్తుంటారు. మరోవైపు శవయాత్ర ముందర డప్పుల చప్పుళ్లు వినిపిస్తాయి. కొందరు యువకులు డప్పులు వాయిస్తూ, అడుగులు కదుపుతూ నృత్యాలు చేస్తుంటారు. ఆ దృశ్యాన్ని చూసేవారికి సంప్రదాయంగా కనిపించవచ్చు. మరికొందరికి ఆశ్చర్యంగా అనిపించవచ్చు. కానీ ఆ డప్పు చప్పుళ్ల వెనుక ఉన్న మనుషుల జీవితాలను ఎప్పుడైనా ఆలోచించామా?ఒకవైపు మరణించిన వ్యక్తికి చివరి వీడ్కోలు పలుకుతున్న కుటుంబం. మరోవైపు పొట్టకూటి కోసం డప్పు పట్టిన యువకులు. ఒకరి ఇంట్లో కన్నీళ్లు. మరొకరి జీవితంలో బతుకుదెరువు కోసం పోరాటం. ఈ రెండు దృశ్యాల మధ్య దాగి ఉన్న సామాజిక వాస్తవం హృదయాన్ని కలచివేస్తుంది.

కళకు గౌరవం.కులవృత్తికి సంకెళ్లు ఎందుకు?

డప్పు ఒక కళ. దానికి చరిత్ర ఉంది. సంస్కృతిలో ప్రత్యేక స్థానం ఉంది. సామాజిక చైతన్యానికి, ఉద్యమాలకు అది గొంతుకగా నిలిచింది. కానీ తరతరాలుగా కొన్ని దళిత కుటుంబాలకే శవయాత్రల్లో డప్పులు వాయించే బాధ్యతను ఆపాదించడం వెనుక ఉన్న సామాజిక వ్యవస్థను ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. కళను గౌరవించడం



వేరు. ఒక కులానికి ఆ పనిని పరిమితం చేయడం వేరు. డప్పు వాయించడం అవమానం కాదు. ఆ కళను ప్రదర్శించే యువకులను తక్కువగా చూడటం అన్యాయం. అయితే వారికి ఇతర ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల అదే వృత్తిని కొనసాగించాల్సిన పరిస్థితి ఉంటే, అది సమాజం ఆలోచించాల్సిన అంశం.

ఆ నృత్యాల వెనుక ఆనందముందా.ఆకలి ఆరాటమా?

శవయాత్రలో యువకులు చేసే నృత్యాలను చూసి కొందరు విమర్శిస్తారు. మరికొందరు సంప్రదాయమని సమర్థిస్తారు. కానీ ఆ యువకుల మనసులో ఏముంది? వారు స్వచ్ఛందంగా కళను ప్రదర్శిస్తున్నారా? కుటుంబ పోషణ కోసం చేస్తున్నారా? సామాజిక ఒత్తిడి ఉందా? వారి అభిప్రాయాలను తెలుసుకోకుండా తీర్పులు ఇవ్వడం ఎంతవరకు సమంజసం?

వారి చెమటకు తగిన పారితోషికం అందుతోందా? వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందుతోందా? వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామా? అన్న ప్రశ్నలకు సమాజం సమాధానం చెప్పాలి.

మారాల్సింది యువత మాత్రమే కాదు.సమాజపు ఆలోచనా విధానం కూడా!

సమానత్వం గురించి మాట్లాడుతున్న కాలంలోనూ వృత్తి ఆధారంగా మనుషులను గుర్తించే ధోరణి కొనసాగడం బాధాకరం. కులవివక్షకు వ్యతిరేకంగా నినదించే సమాజం, ఆచరణలోనూ సమాన గౌరవాన్ని చూపాలి. డప్పు కళాకారులకు కళాకారులుగా గుర్తింపు, గౌరవం, న్యాయమైన పారితోషికం, సామాజిక భద్రత కల్పించాలి. ఆసక్తి ఉన్న యువతకు కళారంగంలో ఎదిగే అవకాశాలతోపాటు ఇతర రంగాల్లో ఉపాధి మార్గాలు కూడా చూపాలి.

చివరగా ఒక్కప్రశ్న

ఒక మనిషి మరణించినప్పుడు అతని కుటుంబం కన్నీరు పెడుతుంది. అదే సమయంలో డప్పు వాయిస్తున్న యువకుడి కుటుంబంలోనూ ఎన్నో ఆర్థిక కష్టాలు, ఆశలు, బాధలు ఉండవచ్చు. ఆ డప్పు చప్పుళ్లను వింటున్న మనం ఆ మనుషుల జీవితాల గురించి ఎప్పుడైనా ఆలోచించామా?

శవం ముందు డప్పు మోగడం కంటే. ఆ డప్పు పట్టిన యువకుడి జీవితంలో పేదరికం మోగకుండా చూడటం ముఖ్యం. వారి చేతుల్లో డప్పుతోపాటు విద్య, ఉపాధి, గౌరవం, సమాన అవకాశాలు ఉండాలి. ఒకరి మరణం మరోకరి బతుకుదెరువుగా మారే పరిస్థితిని అవమానంగా చూడటం కాదు.ఆ వృత్తిలోని మనుషులకు గౌరవప్రదమైన జీవితం కల్పించడం సమాజం బాధ్యత.

డప్పు చప్పుళ్లు ఆగిపోవాలని కాదు.ఆ డప్పు పట్టిన చేతులకు వివక్ష సంకెళ్లు తెగిపోవాలని కోరుకుందాం. మనిషికి మనిషిగా గౌరవం దక్కినప్పుడే నిజమైన మానవత్వం బతికినట్లు!

ఇంటింటికీ వెళ్లి నేరాలపై పోలీసుల అవగాహన

సైబర్ మోసాలు, డిజిటల్ అరెస్టులపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ మహేందర్

హసన్‌పర్తి/నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతే లక్ష్యంగా హసన్‌పర్తి పోలీసుల ఆధ్వర్యంలో ఆదర్శ్‌నగర్‌లో ఆదివారం ఇంటింటికీ పోలీస్ (డోర్ టు డోర్ కమ్యూనిటీ కనెక్ట్) కార్యక్రమం నిర్వహించారు. సీఐ ఎ. మహేందర్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి కాలనీవాసులకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా



ఉండాలని, అపరిచితులకు ఓటీపీ, వ్యక్తిగత వివరాలు వెల్లడించవద్దని సూచించారు. పోలీసులమంటూ భయపెట్టి డబ్బులు వసూలు చేసే డిజిటల్ అరెస్ట్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. నేరాల నియంత్రణకు ఇళ్ల వద్ద, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.యువత గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి విక్రయాలు, రవాణా గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

ముస్త్యాలలో 10, 12వ వార్డుల్లో ఎల్ఈడీ దీపాల ఏర్పాటు

జనగామ/చేర్యాల, నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): మండలంలోని ముస్త్యాల గ్రామంలో నూతన ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 10, 12వ వార్డుల్లో పాత దీపాల స్థానంలో కొత్త ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వార్డు సభ్యులు చింతల విజయ్‌కుమార్, బండారి సతీష్ తెలిపారు. నూతన దీపాల ఏర్పాటుతో రాత్రి వేళల్లో ప్రజలకు ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు రాకపోకలు సురక్షితంగా సాగనున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యాసంగిలో వరి, మొక్కజొన్న సాగు చేయొద్దు

తక్కువ నీటితో పండే పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలి

ఖమ్మం/నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో యాసంగిలో అధిక నీరు అవసరమయ్యే వరి, మొక్కజొన్న పంటలను సాగు చేయవద్దని వైరా మండల వ్యవసాయ అధికారి మయాంకు మంజు ఖాన్, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ డిప్యూటీ ఇంజినీర్ వల్లపు నాగబ్రహ్మం రైతులకు సూచించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ నీటి లభ్యతపై అనిశ్చితి ఉన్నందున ప్రాజెక్టు కాలువలపై ఆధారపడి వరి, మొక్కజొన్న సాగు చేపట్టవద్దని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే



అవకాశం ఉన్నందున నీటిని తక్కువగా వినియోగించే పెసర, మినుము, కుసుమ తదితర పంటలను సాగు చేయాలని సూచించారు. నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని పంటల ఎంపిక చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు పరిటాల వెంకట నరసయ్య, మేడా రాజేష్, లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మ డైరెక్టర్ గడిపూడి రామకృష్ణ, ఐలూరు కృష్ణారెడ్డి, బిల్లా నరసింహారావు, కోట ఆదాం, మహంకాళి కృష్ణమోహన్ తదితర రైతులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

జనగామ/చేర్యాల, నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): చేర్యాల పట్టణంలోని 1వ వార్డుకు చెందిన మిట్టపల్లి నారాయణరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి తరపున సోమవారం పట్టణ బీఆర్ఎస్ నాయకులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముస్త్యాల అరుణ బాలనర్సయ్య, పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వరరావు,



మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి శ్రీధర్ రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ పూర్మ వెంకట్ రెడ్డి, టౌన్ జాయింట్ సెక్రటరీ బురగోని తిరుపతి గౌడ్, నాయకులు మంచాల కొండయ్య, ఆవుశర్ల కిష్టయ్య, కుటుంబ సభ్యులు మిట్టపల్లి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఎంఆర్‌పీకి మంగళం..

వ్యాపారుల ఇష్టారాజ్యం!

కిరాణా దుకాణాల్లో అధిక ధరల దోపిడీ..

రూ.35 బాటిల్‌కు రూ.50 వసూలు..

బెల్ట్ దందాతో పాటు వినియోగదారుల జేబులకు చిల్లులు.. అధికారుల తనిఖీలు ఎక్కడ?

రాయపర్తి/నవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):

వినియోగదారుల హక్కులు కాగితాలకే పరిమితమవుతున్నాయా? దుకాణాల్లో ధరల నియంత్రణ కనిపించడం లేదా? వరంగల్ జిల్లా రాయపర్తి మండల పరిధిలోని రాయపర్తి, మహబూబ్‌నగర్ గ్రామాల్లోని కొన్ని కిరాణా దుకాణాల్లో వస్తువులను ముద్రించిన గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ) కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా అర లీటరు మజా శీతల పానీయ సీసాపై ముద్రించిన ధర రూ.35 ఉండగా, రూ.50 వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. అంటే ఒక్క సీసాపై అదనంగా రూ.15 వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు.ఇదేమిటని ప్రశ్నిస్తే.. మా దుకాణంలోనే కాదు, గ్రామంలో అందరూ ఇలాగే అమ్ముతున్నారంటూ కొందరు వ్యాపారులు సమాధానం చెబుతున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు. గ్రామంలో ఇతర దుకాణాలు కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నాయనే కారణంతో నిబంధనలకు విరుద్ధమైన వసూళ్లకు సమర్థన లభిస్తుందా? ఒకరు తప్పు చేస్తే మరొకరు అదే తప్పును కొనసాగించవచ్చా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.శీతల పానీయాల నుంచి నిత్యావసర సరుకుల వరకు కొన్ని దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు కిరాణా దుకాణాల ముసుగులో బెల్ట్ దుకాణాల తరహాలో



మద్యం విక్రయాలు కూడా విచ్చలవిడిగా సాగుతున్నాయనే ఫిర్యాదులు ఉన్నాయి. వీటిపై సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఎంఆర్‌పీ కంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తప్పవు!

వినియోగదారుల రక్షణ చట్టం, 2019 ప్రకారం వస్తువుల విక్రయాల్లో వినియోగదారుల హక్కులకు రక్షణ కల్పించాల్సి ఉంటుంది. లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్డ్ కమోడిటీస్) నిబంధనల ప్రకారం ప్యాకేజీపై ముద్రించిన గరిష్ఠ చిల్లర ధర కంటే ఎక్కువ వసూలు చేయడం నిబంధనల ఉల్లంఘన కిందికి వస్తుంది. అయితే బహిరంగంగా విక్రయించే ప్రతి వస్తువుకు ఒకే ధర నిబంధన వర్తించదు. ప్యాకేజీపై ముద్రించిన ధర, విక్రయ విధానం ఆధారంగా అధికారులు పరిశీలించాలి. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి.

అధికారుల తనిఖీలు ఏమైనట్లు?

గ్రామాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాల్లో ధరల పట్టికలు, వస్తువులపై ముద్రించిన ధరలు, విక్రయ రశీదులు పరిశీలించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలి. అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. బెల్ట్ దుకాణాలుగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులపైనా ఎక్సైజ్ శాఖ విచారణ చేపట్టాలి.

ప్రజల జేబులకు చిల్లులు పడుతున్నా పట్టించుకునేది ఎవరు?

రోజువారీ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునే సామాన్యులు ప్రతి రూపాయినీ లెక్కపెట్టుకుంటారు. అలాంటి వారి వద్ద వస్తువుల ముద్రిత ధర కంటే అదనంగా వసూలు చేయడం చిన్న విషయం కాదు. ప్రశ్నించిన వినియోగదారులకు సమాధానం చెప్పాల్సింది పోయి, అందరూ ఇలాగే అమ్ముతున్నారనే ధోరణి ప్రదర్శించడం వ్యాపార బాధ్యతకు విరుద్ధం.రాయపర్తి, మహబూబ్‌నగర్ గ్రామాల్లోని దుకాణాలపై జిల్లా పౌరసరఫరాల శాఖ, లీగల్ మెట్రాలజీ శాఖ, సంబంధిత ఎక్సైజ్ అధికారులు తక్షణమే సంయుక్తంగా క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలి. ఎంఆర్‌పీ ఉల్లంఘనలపై తనిఖీలు నిర్వహించి, బెల్ట్ దుకాణాల ఆరోపణలపై వాస్తవాలను నిర్ధారించి, ఉల్లంఘనలు రుజువైతే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అధికారులు స్పందించి తీసుకున్న చర్యలను ప్రజలకు వెల్లడించాలి.ఎంఆర్‌పీ అనేది వ్యాపారుల ఇష్టానుసార ధర కాదు.. వినియోగదారుల హక్కుకు సంబంధించిన అంశం. గ్రామంలో అందరూ అధిక ధరలకు అమ్ముతున్నారనే సమాధానం చట్టానికి ప్రత్యామ్నాయం కాదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందిస్తారా? లేక సామాన్యుల జేబులకు చిల్లులు పడుతూనే ఉంటాయా?

ముంబై వీధుల్లో యువరాజు దంపతుల గల్లీ క్రికెట్ సందడి!

సచిన్ టెండూల్కర్‌తో కలిసి బ్యాటింగ్, బౌలింగ్.. స్థానిక విద్యార్థులతో సరదాగా ఆట.. మట్టి కప్పుల్లో చాయ్ ఆస్వాదించిన ప్రిన్స్ విలియం, కేట్



హైదరాబాద్: బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియం, ఆయన భార్య ప్రిన్సెస్ కేట్ మిడిల్టన్ ముంబై వీధుల్లో సందడి చేశారు. తమ అధికారిక పర్యటనలో భాగంగా సంప్రదాయ కార్యక్రమాలకు భిన్నంగా స్థానిక చిన్నారులతో కలిసి గల్లీ క్రికెట్ ఆడుతూ అందరినీ ఆకట్టుకున్నారు. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కూడా ఈ ఆటలో పాల్గొనడంతో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువరాజు దంపతులు చిన్నారులతో కలిసిపోయి సరదాగా క్రికెట్ ఆడిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.బ్రిటన్ యువరాజు విలియం, ఆయన భార్య కేట్ మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా సోమవారం ముంబైకి చేరుకున్నారు. నగరంలోని బల్లార్డ్ ఎస్టేట్‌లో ఎన్. మొరార్జీ రోడ్డుపై ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడికి చేరుకున్న రాజదంపతులకు స్థానికులు సంప్రదాయ ధోల్ తాషా వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక పాఠశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి గల్లీ క్రికెట్ ఆడారు.**సచిన్‌తో కలిసి క్రికెట్ ఆడిన యువరాజు**ఈ కార్యక్రమంలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పాల్గొని రాజదంపతులకు ఆటలో సూచనలు చేశారు. ప్రిన్స్ విలియం బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ తన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఆయన ఐదు బంతులు ఆడిన అనంతరం ఐదో బంతికి బౌల్డ్ అయ్యారు. అనంతరం బౌలింగ్‌కు దిగిన విలియం బంతులను ఎదుర్కొన్న కేట్ మిడిల్టన్ కూడా బ్యాటింగ్‌లో ఆసక్తి చూపించారు. ఆమె దాదాపు రెండు ఓవర్ల పాటు బ్యాటింగ్ చేయగా, ఎనిమిదో బంతికి విలియం ఆమెను అవుట్ చేశారు.ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. కొందరు రాజదంపతులతో కలిసి క్రికెట్ ఆడగా, మరికొందరు ఆటను వీక్షిస్తూ ఉత్సాహంగా గడిపారు. సచిన్ టెండూల్కర్‌ను దగ్గరగా చూసి, ఆయనతో కలిసి క్రికెట్ ఆడే అవకాశం రావడం విద్యార్థులకు మధురానుభూతిగా మారింది.**మట్టి కప్పుల్లో చాయ్.. భారతీయ సంప్రదాయానికి ముగ్ధులు**క్రికెట్ ఆట ముగిసిన అనంతరం ప్రిన్స్ విలియం, కేట్ మిడిల్టన్ సచిన్ టెండూల్కర్‌తో కలిసి స్థానిక టీ దుకాణాన్ని సందర్శించారు. అక్కడ మట్టి కప్పుల్లో అందించిన సంప్రదాయ కుల్హడ్ చాయ్‌ను ఆస్వాదించారు. సాధారణ ప్రజల మధ్యకు వెళ్లి స్థానిక వాతావరణాన్ని అనుభవించడం ఈ పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టీ దుకాణం నిర్వాహకులు కూడా రాజదంపతులకు చాయ్ అందించడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.**పదేళ్ల తర్వాత మళ్లీ అదే సందడి**ప్రిన్స్ విలియం, కేట్ దంపతులు 2016లో కూడా భారతదేశంలో పర్యటించిన సందర్భంగా ముంబైలోని ఓవల్ మైదానంలో స్థానిక చిన్నారులతో కలిసి క్రికెట్ ఆడారు. అప్పట్లోనూ సచిన్ టెండూల్కర్ వారితో పాల్గొన్నారు. ఇప్పుడు పదేళ్ల తర్వాత మరోసారి ముంబైలో సచిన్‌తో కలిసి గల్లీ క్రికెట్ ఆడటంతో ఈ కార్యక్రమానికి మరింత ప్రత్యేకత ఏర్పడింది.**ఎర్త్‌షాట్ పురస్కారాల కోసం భారత్‌కు రాక**ప్రిన్స్ విలియం 2020లో ప్రారంభించిన 'ఎర్త్‌షాట్ ప్రైజ్' వార్షిక పురస్కారాల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ రాజదంపతులు భారత్‌కు వచ్చారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల నియంత్రణ, ప్రకృతి వనరుల సంరక్షణకు వినూత్న పరిష్కారాలు చూపుతున్న ప్రాజెక్టులను ఈ పురస్కారాల ద్వారా ప్రోత్సహిస్తున్నారు. నవంబర్ 17న జరిగే కార్యక్రమంలో ఐదు విభాగాల్లో ఎంపికైన విజేతలకు ఒక్కొక్కరికి మిలియన్ పౌండ్ల చొప్పున బహుమతి అందించనున్నారు.ఈ వేడుకకు బాలీవుడ్ దర్శకుడు కరణ్ జోహర్ వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు. బాలీవుడ్ నటీనటులు అలియా భట్, సోనమ్ కపూర్, రామీ మాలెక్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. గాయని శ్రేయా ఘోషల్‌తో పాటు బ్రిటిష్ పాప్ సంగీత బృందం టేక్ దట్ ప్రత్యేక సంగీత ప్రదర్శనలు ఇవ్వనుంది.

ముంబై మెట్రో ప్రయాణం.. మోదీతో భేటీమూడు రోజుల పర్యటనలో భాగంగా రాజదంపతులు ముంబైలో మెట్రో రైలులో ప్రయాణించడంతో పాటు భారతీయ సినిమా, ఫ్యాషన్, పర్యావరణ ఆవిష్కరణలకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అనంతరం నవంబర్ 18న న్యూఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశం కానున్నారు. మొత్తంగా ప్రిన్స్ విలియం, కేట్ మిడిల్టన్ పర్యటనలో గల్లీ క్రికెట్ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాజభవనాలకే పరిమితమయ్యే రాజదంపతులు సాధారణ ప్రజల మధ్యకు వచ్చి చిన్నారులతో కలిసి ఆటలాడటం, స్థానిక సంప్రదాయాలను ఆస్వాదించడం అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా సచిన్ టెండూల్కర్‌తో కలిసి క్రికెట్ ఆడటం భారత అభిమానులకు మరపురాని దృశ్యంగా నిలిచింది.

48 బంతుల్లో 135 పరుగులు.. పాటిదార్ ప్రపంచ రికార్డు!

- 13 సిక్సర్లు, 8 ఫోర్లతో విధ్వంసం.. అస్సాంపై మధ్యప్రదేశ్ ఘన విజయం



హైదరాబాద్: భారత క్రికెటర్, ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో సంచలన ఇన్నింగ్స్‌తో ప్రపంచ రికార్డు సృష్టించాడు. అస్సాంతో జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ తరఫున బరిలోకి దిగిన పాటిదార్ కేవలం 48 బంతుల్లోనే అజేయంగా 135 పరుగులు సాధించాడు. ఇందులో 13 సిక్సర్లు, 8 ఫోర్లు ఉన్నాయి. 281.25 స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేస్తూ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు.మధ్యప్రదేశ్ 57 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న సమయంలో క్రీజులోకి వచ్చిన పాటిదార్ జట్టును ఆదుకున్నాడు. శివాంగ్ కుమార్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 62 బంతుల్లో 153 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. కేవలం 41 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. దీంతో మధ్యప్రదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 250 పరుగులు సాధించింది.251 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అస్సాం 17.4 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌటైంది. దీంతో మధ్యప్రదేశ్ 131 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.


సిరీస్ గెలిచినా.. బ్యాటింగ్‌పై ఆందోళన!

● కోహ్లీ మినహా ఎవరూ అర్ధశతకం చేయలేదు.. బౌలర్లే భారత్‌కు విజయాన్ని అందించారు



హైదరాబాద్: న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు వన్డేల సిరీస్‌ను భారత్ 3-1తో కైవసం చేసుకున్నప్పటికీ బ్యాటర్ల ప్రదర్శన అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది. 2027 వన్డే ప్రపంచకప్‌కు సన్నాహకంగా భావిస్తున్న ఈ సిరీస్‌లో భారత బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు.విరాట్ కోహ్లీ మినహా మరే భారత బ్యాటర్ కూడా అర్ధశతకం సాధించలేదు. తొలి వన్డేలో కోహ్లీ 51 బంతుల్లో 74 పరుగులు చేయగా, ఆ తర్వాత వరుసగా 7, 0, 5 పరుగులకే పరిమితమయ్యాడు. ఇషాన్ కిషన్, అక్షర్ పటేల్ చివరి వన్డేలో చెరో 46 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచారు.రోహిత్ శర్మ సిరీస్ మొత్తంలో కేవలం 30 పరుగులే చేశాడు. శుభ్‌మన్ గిల్ అత్యధిక స్కోరు 37 పరుగులు కాగా, శ్రేయస్ అయ్యర్ 30 పరుగులకే పరిమితమయ్యాడు. కీలక ఆటగాళ్లు విఫలమవడం జట్టు యాజమాన్యానికి ఆందోళన కలిగిస్తోంది.మరోవైపు భారత బౌలర్లు అద్భుత ప్రదర్శనతో జట్టుకు విజయాన్ని అందించారు. అన్షుల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్ మ్యాచ్‌లలో కీలకంగా నిలిచారు. నాలుగు మ్యాచ్‌ల్లో తొమ్మిది వికెట్లు తీసిన గుర్నూర్ బ్రార్‌కు సిరీస్ ఉత్తమ ఆటగాడి అవార్డు లభించింది. సిరీస్ గెలిచినా, ప్రపంచకప్‌కు ముందు బ్యాటింగ్ లోపాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం భారత్‌పై ఉంది

ఐసీసీ చైర్మన్‌గా జై షా మరోసారి ఏకగ్రీవ ఎన్నిక



● రెండోసారి బాధ్యతలు..

ప్రపంచ క్రికెట్ అభివృద్ధిపై దృష్టి

హైదరాబాద్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్‌గా జై షా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండోసారి ఈ పదవికి ఎంపిక కావడంతో ప్రపంచ క్రికెట్ పాలనా వ్యవహారాల్లో ఆయన నాయకత్వం కొనసాగనుంది. ఇండోనేషియాలోని బాలిలో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశాల్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఐసీసీ డైరెక్టర్లు ఆయన పేరును మరోసారి ప్రతిపాదించగా, సభ్యుల నుంచి ఏకగ్రీవ మద్దతు లభించింది. ప్రపంచ క్రికెట్ కీలక మార్పుల దశలో ఉన్న సమయంలో జై షా నాయకత్వాన్ని కొనసాగించాలని ఐసీసీ నిర్ణయించింది.2024 ఆగస్టులో తొలిసారిగా ఐసీసీ చైర్మన్‌గా ఎన్నికైన జై షా అదే ఏడాది డిసెంబర్ 1న బాధ్యతలు స్వీకరించారు. అప్పటికి 35 ఏళ్ల వయసులోనే ఈ పదవిని చేపట్టి ఐసీసీ చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడైన చైర్మన్‌గా గుర్తింపు పొందారు. అంతకుముందు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శిగా పనిచేశారు. భారత క్రికెట్ పరిపాలనలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన, అనంతరం అంతర్జాతీయ క్రికెట్ వ్యవహారాల్లోనూ తనదైన పాత్ర పోషిస్తున్నారు.**ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు ప్రాధాన్యం** జై షా రెండోసారి బాధ్యతలు చేపట్టనున్న సమయంలో క్రికెట్‌కు అంతర్జాతీయంగా మరింత ఆదరణ పెరుగుతోంది. ముఖ్యంగా 2028లో అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో జరిగే ఒలింపిక్ క్రీడల్లో క్రికెట్ తిరిగి ప్రవేశించనుండటం ఐసీసీకి కీలక పరిణామం. వందేళ్లకు పైగా విరామం తర్వాత ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు అవకాశం లభించడం ఈ క్రీడకు ప్రపంచవ్యాప్తంగా కొత్త అభిమానులను సంపాదించిపెట్టే అవకాశంగా భావిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఒలింపిక్స్‌లో క్రికెట్ పోటీలను విజయవంతంగా నిర్వహించడం, కొత్త దేశాలకు ఈ ఆటను విస్తరించడం, యువతను క్రికెట్ వైపు ఆకర్షించడం జై షా ముందున్న ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. అంతర్జాతీయ క్రికెట్ పోటీలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు సభ్య దేశాల మధ్య సమన్వయాన్ని పెంపొందించాల్సిన బాధ్యత కూడా ఆయనపై ఉంది.**మహిళా క్రికెట్‌కు ప్రోత్సాహం**ప్రపంచవ్యాప్తంగా మహిళా క్రికెట్‌కు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఈ విభాగానికి మరింత ప్రోత్సాహం అందించాలని ఐసీసీ నిర్ణయించింది. మహిళా క్రీడాకారిణులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే దేశాల సంఖ్యను పెంచడం, అభివృద్ధి చెందుతున్న క్రికెట్ దేశాలకు అవసరమైన సహకారం అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.అసోసియేట్ సభ్య దేశాలకు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో మరిన్ని అవకాశాలు కల్పించడం కూడా ఐసీసీ దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా ఉంది. క్రికెట్‌ను కొన్ని దేశాలకే పరిమితం చేయకుండా ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలనే లక్ష్యంతో కొత్త కార్యక్రమాలను చేపట్టనున్నారు.**సభ్య దేశాల విశ్వాసం.. జై షా కృతజ్ఞతలు**రెండోసారి ఐసీసీ ఛైర్మన్‌గా ఎన్నిక కావడంపై జై షా హర్షం వ్యక్తం చేశారు. తనపై విశ్వాసం ఉంచిన ఐసీసీ బోర్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ క్రికెట్ అభివృద్ధికి సభ్య దేశాలతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు. అభిమానులు, క్రీడాకారులు, వాణిజ్య భాగస్వాములు, ఇతర భాగస్వాముల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని క్రికెట్ భవిష్యత్తును మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని వెల్లడించారు.లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం కొత్త తరానికి ఈ ఆటను పరిచయం చేసే గొప్ప అవకాశమని ఆయన అభిప్రాయపడ్డారు. కేవలం అంతర్జాతీయ టోర్నమెంట్ల నిర్వహణకే పరిమితం కాకుండా, క్రికెట్‌కు స్థిరమైన భవిష్యత్తును నిర్మించాల్సిన బాధ్యత ఐసీసీపై ఉందన్నారు.ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ రిచర్డ్ థాంప్సన్ కూడా జై షా పునర్నియామకంపై అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్‌ను బలోపేతం చేయడంతో పాటు ద్వైపాక్షిక సిరీస్‌ల ప్రాధాన్యతను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జింబాబ్వే క్రికెట్ ఛైర్మన్, ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ టావెంగ్వా ముకుహ్లానీ సైతం ఆయన నాయకత్వాన్ని స్వాగతించారు.**ప్రపంచ క్రికెట్‌కు కీలక దశ**ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్ అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ద్వైపాక్షిక సిరీస్‌లు, ప్రపంచకప్‌లు, ఫ్రాంచైజీ లీగ్‌ల మధ్య సమతుల్యత సాధించడం, క్రీడాకారుల ప్రయోజనాలను కాపాడటం, చిన్న క్రికెట్ దేశాలకు ఆర్థికంగా అండగా నిలవడం ఐసీసీ ముందున్న ప్రధాన సవాళ్లు. వాణిజ్యపరమైన అభివృద్ధితో పాటు ఆటలో సంప్రదాయ విలువలను కాపాడటం కూడా అవసరం.ఈ నేపథ్యంలో జై షా రెండోసారి ఐసీసీ ఛైర్మన్‌గా ఎన్నిక కావడం ప్రపంచ క్రికెట్ పరిపాలనలో కీలక పరిణామంగా నిలిచింది.

అర్ష్‌దీప్ విజయాల వెనుక సమ్రీన్ ప్రోత్సాహం!



- కాబోయే భార్య సహకారంతోనే మానసిక ధైర్యం.. ఆసక్తికర విషయాలు వెల్లడించిన భారత పేసర్

స్పోర్ట్స్ డెస్క్: భారత యువ క్రికెటర్, పేసర్ అర్ష్‌దీప్ సింగ్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. క్రికెట్‌లో తన ప్రదర్శన మెరుగుపడటానికి కాబోయే భార్య సమ్రీన్ కౌర్ అందిస్తున్న ప్రోత్సాహం, సహకారం ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపాడు. మైదానంలో ఒత్తిడిని ఎదుర్కొనే సమయంలో ప్రశాంతంగా ఉండటం, సరైన నిర్ణయాలు తీసుకోవడంలో ఆమె మాటలు తనకు ఎంతో ధైర్యాన్ని ఇస్తాయని పేర్కొన్నాడు.క్రికెట్‌లో విజయాలు సాధించాలంటే శారీరక సామర్థ్యంతో పాటు మానసిక స్థైర్యం కూడా అవసరమని అర్ష్‌దీప్ అభిప్రాయపడ్డాడు. మ్యాచ్‌ల సమయంలో ఎదురయ్యే ఒత్తిడి, వైఫల్యాలను అధిగమించేందుకు కుటుంబ సభ్యులు, ఆత్మీయుల మద్దతు కీలకమని తెలిపాడు. సమ్రీన్ తనకు ఎప్పుడూ అండగా ఉంటూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగేందుకు ప్రోత్సహిస్తుందని వివరించాడు.

ప్రేమను వ్యక్తం చేసిన అర్ష్‌దీప్గత నవంబర్ 11న న్యూజిలాండ్ పర్యటన సందర్భంగా అర్ష్‌దీప్ సింగ్ సమ్రీన్ కౌర్‌కు ప్రేమప్రతిపాదన చేశాడు. ఈ సందర్భంగా వారిద్దరి ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అప్పటి నుంచి ఈ జంటకు సంబంధించిన విషయాలపై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. తాజాగా సమ్రీన్ గురించి అర్ష్‌దీప్ చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

మైదానంలోనూ సత్తా చాటిన పేసర్న్యూజిలాండ్‌తో జరిగిన చివరి వన్డేలో అర్ష్‌దీప్ సింగ్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 30 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. వ్యక్తిగత జీవితంలో సమ్రీన్ ప్రోత్సాహం, మైదానంలో తన కష్టపడి ఆడే తత్వం తనకు మరింత ఆత్మవిశ్వాసాన్ని ఇస్తున్నాయని అతడి వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది.

అమ్మకానికి ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
మంగళవారం17 నవంబర్ 2026



ఘనంగా తేజ సజ్జా నిశ్చితార్థం..

తరలివచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు

'హనుమాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో తేజ సజ్జా ఓ ఇంటివాడు కాబోతున్నారు. ఆయన తన బ్యాచిలర్ జీవితానికి ముగింపు పలుకుతూ పెళ్లి పీటలెక్కేందుకు సిద్ధమయ్యారు. నేడు హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య తేజ నిశ్చితార్థ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి పలువురు సినీ, రాజకీయ రంగ ప్రముఖులు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు మెగాస్టార్ చిరంజీవి, రవితేజ, నాని, రానా, రాఘవేంద్రరావు, ప్రశాంత్ వర్మ తదితరులు హాజరయ్యారు. ప్రస్తుతం ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



వచ్చే డిసెంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో తేజ వివాహం జరగనుంది. ఈ పెళ్లి వేడుకను కేవలం కుటుంబ సభ్యుల సమక్షంలోనే ప్రైవేట్‌గా నిర్వహించనున్నారు. అనంతరం హైదరాబాద్‌లో స్నేహితులు, సినీ ప్రముఖుల కోసం గ్రాండ్‌గా రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. కాగా, తేజ వివాహం చేసుకోబోయే అమ్మాయి వివరాలను గోప్యంగా ఉంచారు. ఆమె అమెరికాలో పెరిగారని, ఐటీ రంగంలో వ్యాపారం చేస్తున్నారని తెలుస్తోంది. ఇది పెద్దలు కుదిర్చిన వివాహం అని సమాచారం.ఇక సినిమాల విషయానికొస్తే, 'హనుమాన్', 'మిరాయ్' వంటి విజయాల తర్వాత తేజ పలు క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఆయన గతంలో నటించిన 'జాంబిరెడ్డి' సినిమాకు సీక్వెల్‌తో పాటు 'హనుమాన్' సీక్వెల్‌లోనూ నటించనున్నారు.

'వారణాసి' షూటింగ్ పూర్తి..

అసలైన బ్లాస్ట్ ముందుందంటూ జక్కన్న టీమ్ సస్పెన్స్!

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్, ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న 'వారణాసి'. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' చిత్రాలతో ప్రపంచ వేదికపై తెలుగు సినిమా సత్తాను చాటిన రాజమౌళి తదుపరి చిత్రం కావడంతో దీనిపై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. ఈ నేపథ్యంలో చిత్ర బృందం తాజాగా ఒక కీలకమైన అప్‌డేట్‌తో పాటు అభిమానుల్లో మరింత ఉత్కంఠను రేకెత్తించే ఒక హింట్ ఇచ్చింది.

'వారణాసి' చిత్రం షూటింగ్ మొత్తం పూర్తయినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు సినిమా అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో ఒక పోస్ట్ చేసింది. ప్రస్తుతం సినిమా కీలకమైన పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉందని, విజువల్ ఎఫెక్ట్స్ పనులతో పాటు రీ-రికార్డింగ్ కూడా జరుగుతోందని స్పష్టం చేసింది. త్వరలోనే డబ్బింగ్ పనులు ప్రారంభం కానున్నాయని తెలిపింది. సరిగ్గా ఏడాది క్రితం అత్యంత వైభవంగా జరిగిన ఈ సినిమా అనౌన్స్‌మెంట్ ఈవెంట్ ఎంతటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఇప్పుడు షూటింగ్ పూర్తికావడంతో సినిమా నిర్మాణంలో మరో ముఖ్యమైన ఘట్టం ముగిసినట్లయింది.

అయితే, ఈ అప్‌డేట్‌లో అసలైన కిక్ చివర్లో ఉంది. "ఇది అప్‌డేట్ అనుకుంటే అప్‌డేట్. కానీ, అసలైన బ్లాస్ట్ కోసం మరికొంత కాలం వేచి ఉండండి" అన్నట్లుగా చిత్ర బృందం తన పోస్ట్‌లో పేర్కొంది. ఈ ఒక్క వ్యాఖ్యతో అభిమానుల్లో, సినీ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. ఇంతకీ రాజమౌళి ప్లాన్ చేస్తున్న ఆ 'బ్లాస్ట్' ఏంటి? సినిమాకు సంబంధించిన గ్లింప్స్ లేదా మేకింగ్ వీడియో విడుదల చేస్తారా? లేక మహేశ్ బాబు పాత్రకు సంబంధించిన లుక్ రివీల్ చేస్తారా? అంటూ సోషల్ మీడియాలో ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి.ఈ చిన్న హింట్‌తోనే సినిమాపై అంచనాలు మరో స్థాయికి చేరాయి. ఏది ఏమైనా, పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండటంతో సినిమా అనుకున్న సమయానికే ప్రేక్షకుల ముందుకు రావడం ఖాయంగా కనిపిస్తోంది. ముందుగా ప్రకటించినట్లుగా 'వారణాసి' చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ గ్లోబల్ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో మహేశ్ బాబును రాజమౌళి ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.



'ఆకాశంలో ఒక తార' ట్రైలర్

: అమ్మాయి స్పేస్ డ్రీమ్ వెనుక దుల్కర్!

తెలుగులో ఎప్పుడూ డిఫరెంట్ కథలను ఎంచుకునే దుల్కర్ సల్మాన్, మరోసారి ఒక ఫ్రెష్ కాన్సెప్ట్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. పవన్ సాధినేని దర్శకత్వంలో నటించిన లేటెస్ట్ మూవీ 'ఆకాశంలో ఒక తార'. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మించిన ఈ సినిమా ట్రైలర్ రిలీజైంది. కమర్షియల్ హంగుల జోలికి వెళ్లకుండా, ఒక ఎమోషనల్ డ్రామాను తెరపైకి తెస్తున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. అబ్దుల్ కలాం కొటేషన్ తో మొదలైన ట్రైలర్, గోదావరి పల్లెటూరి బ్యాక్ డ్రాప్ లో సాగే ఒక సింపుల్ కథను పరిచయం చేసింది. ఇందులో కల్పన పాత్రలో సాత్విక వీరవల్లి కనిపిస్తున్నారు. ఇంగ్లీష్ కూడా సరిగ్గా రాని ఒక సాధారణ అమ్మాయి, ఆస్ట్రోనాట్ అయి స్పేస్ లోకి వెళ్లాలని పెద్ద కల కంటుంది. చుట్టుపక్కల వాళ్లంతా ఆమె ఆశను చూసి నవ్వుతున్నా, కృష్ణ పాత్రలో దుల్కర్ సల్మాన్ ఆమెకు సపోర్ట్ గా నిలుస్తారు. తన కల కోసం తానే కాలిలా మారి నడిపించాలనుకునే పల్లెటూరి కుర్రాడిగా దుల్కర్ లుక్, బాడీ లాంగ్వేజ్ నేచురల్ గా ఉన్నాయి. ూశ్రీంశీ =ఘుఎ – ఇప్పుడు వదలకపోతే.. పెళ్లి జరగదు.. నన్ను వదిలేయండి ప్లీజ్! ట్రైలర్ లో డైలాగ్స్ కంటెంట్ కు తగ్గట్లు సింపుల్ గా, ఎమోషనల్ గా కుదిరాయి. "పది మంది నవ్వితే ఏంటి.. ఒక్కళ్లు నమ్మితే చాలదా కృష్ణ గారూ" అని హీరోయిన్ చెప్పే డైలాగ్ తో పాటు, చివర్లో కారులో దుల్కర్ ఎమోషనల్ అవుతూ "రేపు నువ్వు నన్ను వదిలి వేల కిలోమీటర్లు వెళ్తావ్.. అలవాటు చేసుకో" అని చెప్పే సీన్ టచ్ చేసేలా ఉంది. గ్రామీణ వాతావరణం నుంచి డీఆర్డీవో, ప్రైవేట్ స్పేస్ మిషన్ వరకు కథ మారే తీరును నీట్ గా కట్ చేశారు.ఈ ట్రైలర్ లో శ్రుతి హాసన్ రోల్ సర్ ప్రైజ్ ట్విస్ట్ లా కనిపిస్తోంది. రాకెట్ ప్రయోగాలు చేసే ఒక బోల్డ్ స్పేస్ సైంటిస్ట్ గా, సిగరెట్ తాగుతూ కాస్త రఫ్ యాటిట్యూడ్ ఉన్న 'రోహిణి' పాత్రలో శ్రుతి కొత్తగా కనిపించారు. కల్పన టాలెంట్ ను గుర్తించి తన టీమ్ లోకి తీసుకునే కీలక పాత్రలో ఆమె నటించారు. ఇక ట్రైలర్ ఎండింగ్ లో రుహాని శర్మ ఎంట్రీ ప్లెజెంట్ గా ఉంది. "ఆప్ దోనో కా కహానీ బహుత్ ప్యారా హై" అంటూ ఆమె చెప్పిన డైలాగ్ తో ట్రైలర్ ను కూల్ గా ముగించారుటెక్నికల్ వర్క్ కూడా సినిమాకు బాగానే సెట్ అయినట్లు కనిపిస్తోంది. సుజిత్ సారంగ్ కెమెరా వర్క్ ఒకవైపు గోదావరి విలేజ్ విజువల్స్ ను, మరోవైపు స్పేస్ సెటప్ ను రిచ్ గా చూపించింది. జీవీ ప్రకాష్ కుమార్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సన్నివేశాల్లోని ఎమోషన్ ను బాగా క్యారీ చేసింది. గుణ్ణం గంగరాజు రైటింగ్, ప్రవీణ్ కెఎల్ ఎడిటింగ్ సినిమాకు ప్లస్ అయ్యేలా ఉన్నాయి. రొటీన్ ఫార్ములా సినిమాలకు భిన్నంగా ఒక ఇన్‌స్పైరింగ్ డ్రామాగా 'ఆకాశంలో ఒక తార' రూపొందినట్లు ట్రైలర్ క్లారిటీ ఇస్తోంది. ఎక్కడా ఓవర్ డ్రామా లేకుండా, కంటెంట్ మీద నమ్మకంతో తీసిన సినిమా లాగా అనిపిస్తోంది. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, హిందీ భాషల్లో నవంబర్ 20న ఈ మూవీ థియేటర్లలో రిలీజ్ కానుంది. మరి ఈ పల్లెటూరి అమ్మాయి స్పేస్ జర్నీ ఆడియన్స్ కు ఏ రేంజ్ లో కనెక్ట్ అవుతుందో చూడాలి.



సంగీత దర్శకుడిగా 15 ఏళ్లు.. అనిరుధ్ భావోద్వేగ సందేశం



సంగీత దర్శకుడిగా 15 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతూ భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. ఇన్నేళ్ల ప్రయాణంలో ఎన్నో మధుర జ్ఞాపకాలు, విజయాలు సొంతమయ్యాయని పేర్కొంటూ.. ఇంకా సాధించాల్సిన కలలు ఎన్నో ఉన్నాయని, తన అత్యుత్తమ సంగీతం ముందుందని వెల్లడించారు.15 ఏళ్ల క్రితం ఇదే రోజున తమ తొలి పాట ప్రేక్షకుల ముందుకు వచ్చిందని అనిరుధ్ గుర్తుచేసుకున్నారు. అప్పటి నుంచి ఆగకుండా సాగుతున్న ప్రయాణంలో సంగీతం, జ్ఞాపకాలు, అద్భుతమైన అనుభవాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. తమిళం, తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో పాటలు రూపొందించే అవకాశం దక్కిందని చెప్పారు. స్వతంత్ర సంగీతం, అంతర్జాతీయ కళాకారులతో కలసి పనిచేయడం, వివిధ భాషల్లో పాటలు పాడటం తన ప్రయాణంలో ప్రత్యేక అనుభవాలని పేర్కొన్నారు.

దేశంలోని ప్రముఖ దర్శకులు, నటులు, నిర్మాతలతో కలిసి పనిచేసే అవకాశం లభించిందని అనిరుధ్ తెలిపారు. స్ట్రీమింగ్ రికార్డులు సృష్టించడం, కోట్లాది మంది శ్రోతలకు చేరువ కావడం, ప్రపంచవ్యాప్తంగా సంగీత కచేరీలు నిర్వహించడం మరచిపోలేని అనుభవాలని చెప్పారు. చార్ట్‌బస్టర్ పాటల నుంచి వేలాది మంది అభిమానులు తమ పాటలను గొంతెత్తి పాడటం వరకు ప్రతి సందర్భం ఎంతో ప్రత్యేకమని పేర్కొన్నారు.ఈ ఏడాది తనకు మరింత ప్రత్యేకమని అనిరుధ్ వెల్లడించారు. 2026లో ఆయన సంగీతం అందించిన ఐదు సినిమాలు 'హ×ఖ', 'జననాయగన్', 'ణజ', 'పారడైజ్', 'జైలర్ 2' ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. వీటిలోని పలు పాటలు ఇప్పటికే హిట్‌లుగా నిలిచాయి. 15 ఏళ్ల సంగీత ప్రస్థానానికి ఇంతకంటే మంచి వేడుక ఉండదని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.ఎత్తుపల్లాలు, సవాళ్లు ఎదురైనా ఒక్కరోజు కూడా విరామం తీసుకోకుండా పనిచేశామని అనిరుధ్ చెప్పారు. సంగీతంపై మొదటిరోజు ఉన్న ప్రేమే ఇప్పటికీ తమను ముందుకు నడిపిస్తోందన్నారు. ఇటీవలే కావ్య మారన్‌ను వివాహం చేసుకున్న అనిరుధ్.. అభిమానులు, శ్రోతలు తన పాటలను మళ్లీ మళ్లీ వింటూ, పాడుతూ, ఆదరిస్తూ అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. 15 ఏళ్ల ప్రయాణం ముగిసినా, ఇంకా లక్షలాది కలలు సాకారం చేసుకోవాల్సి ఉందని, మళ్లీ స్టూడియోలోకి అడుగుపెడుతున్నానని పేర్కొన్నారు.

గడ్డకట్టే నీటిలో 6 గంటలు..

'మాతృభూమి' సినిమా కోసం సల్మాన్ కష్టాన్ని వెల్లడించిన దర్శకుడు



బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ తన సినిమా కోసం ఎంతటి కష్టానికైనా సిద్ధపడతారని మరోసారి నిరూపించారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'మాతృభూమి: మే వార్ రెస్ట్ ఇన్ పీస్' షూటింగ్‌లో భాగంగా గడ్డకట్టే చల్లని నీటిలో రోజుకు ఆరు గంటల పాటు గడిపారని దర్శకుడు అపూర్వ లఖీయా వెల్లడించారు. తడిసిన దుస్తులతోనే భోజనం చేస్తూ చిత్రీకరణలో పాల్గొన్నారని తెలిపారు.ఈ సినిమా కోసం తొలుత ముంబైలోని స్టూడియోలో ఓ కీలక సన్నివేశాన్ని చిత్రీకరించాలని భావించారట. అయితే సహజత్వం కోసం సెట్‌లో కాకుండా నిజమైన ప్రదేశంలోనే షూట్ చేయాలని సల్మాన్ సూచించడంతో సెప్టెంబర్ చివర్లో చల్లని నీటిలో చిత్రీకరణ జరిపినట్లు దర్శకుడు చెప్పారు. ఆ నీటి ఉష్ణోగ్రత దాదాపు సున్నా డిగ్రీలకు దగ్గరగా ఉందని వివరించారు. సల్మాన్‌తో పాటు ఇతర నటులు చలికి వణికిపోవడం నటన కాదని, నిజంగానే అంతటి చలిని భరించారని పేర్కొన్నారు.ఈ సన్నివేశాన్ని ఒక్కరోజులో పూర్తి చేయాలనుకున్నా.. రెండున్నర రోజులు పట్టిందని అపూర్వ తెలిపారు. నటీనటులు ఎదుర్కొన్న కష్టాన్ని చూసిన సిబ్బంది, తామే ఆ సీన్ చేస్తున్నంత ఇబిగా చలికి వణికిపోయారని చెప్పారు.సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జియో స్టూడియోస్ ఆల్ ఇండియా పంపిణీ బాధ్యతలు చేపట్టగా, విదేశీ పంపిణీని జీ స్టూడియోస్ నిర్వహిస్తోంది. 2026 డిసెంబర్ 4న ఈ సినిమా విడుదల కానుంది.